# ప్రజాకళ

ప్రజాస్వామిక సాహిత్య పత్రిక

## షహీద్ భగత్ సింగ్ 76వ వర్ధంతి: 1931 మార్చి 23 వతేది



వాడికొకటే ధ్యాస

క్రూరత్వంలో కొత్త పద్ధతులు ఎలా కనిపెట్టాలని

నాకొకటే తపన

అత్యాచారాలన్నింటిని ఎలా అంతమొందించాలని

- భగత్ సింగ్

ఏప్రిల్ 2007 సంచిక

మీ రచనలు, అభిప్రాయాలు పంపించండి, నిర్మాణాత్మక చర్చలో పాల్గొనండి

Editor@Prajakala.org

సూచిక

## కవిత్వం:

*నా చుట్టూ చైతన్యపు విద్యుత్తు - భగత్ సింగ్*............ 3
అమ్మ ఒడి - పి. వెంకటరత్నం ............ 4
మనుషులు అన్నం తినడం లేదు - కొండేపూడి నిర్మల ............ 6
మారిన దూరప్రయాణాలు - జాన్ హైడ్ కనుమూరి ............ 7
మెరిట్! :కవిత ముందుమాట - వరవరరావు............ 10
మెరిట్! - వరవరరావు ............ 11
నీవు మారేదెప్పుడు? - మాదిగ సాంబయ్య గుండిమెడ ............ 17

## కథ:

ఇనుము దొంగలు - ప్రశాంత్ ............ 22

## వ్యాసాలు:

"వెంటాడిన అవమానం" కథ : దళిత వాస్తవిక జీవితం - మొదటి భాగం- డా దార్ల వెంకటేశ్వరరావు............ 30
సాహసం, దేశభక్తికి ప్రతీక 37
మనసు, చైతన్యం - డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్............ 40
కేన్సర్ వ్యవస్థలో ఛిద్రమైన కవి కుటుంబం - వరవరరావు............ 43

## సాహిత్యవార్తలు:

కవిత్వం కళలు, ఉత్పత్తి సంబంధాలనుంచి వచ్చే మానవసారం: కవితా వార్షిక రిపోర్టు
- జాన్ హైడ్ కనుమూరి 48

## ఇంటర్వ్యూ

కవితా వార్షిక ప్రధాన సంపాదకుడు రామా చంద్రమౌళితో ముఖాముఖి............ 52

## ప్రకటనలు:

వాలంటీర్ కరస్పాండెంట్ లకు ప్రజాకళ ఆహ్వానం: ............ 55
'నాకు నచ్చిన కథ', 'నాకు నచ్చిన కవిత' - కొత్త శీర్షికలు............ 56

## ఉల్లేఖనాలు:

స్వాతంత్ర పోరాటం: ఉల్లేఖనాలు ............ 57

## నా చుట్టూ చైతన్యపు విద్యుత్తు - భగత్ సింగ్

*వాడికొకటే ధ్యాస*
*క్రూరత్వంలో కొత్త పద్ధతులు ఎలా కనిపెట్టాలని*
*నాకొకటే తపన*
*అత్యాచారాలన్నింటిని ఎలా అంతమొందించాలని*
*నరకమంటే కోపం ఎందుకు?*
*ఆకాశాన్ని నిందించడం దేనికి?*
*లోకమంతా అన్యాయం నిండివుంటే*
*రా! ఎదుర్కొని పోరాడుదాం*
*పొద్దు పొడుపుని సూచించే వేగుచుక్కని*
*ఆరిపోవడం అంటే భలే ఇష్టం నాకు*

*నా చుట్టూ గాలిలో*
*చైతన్యపు విద్యుత్తు ప్రవహిస్తోంది*
*పిడికెడు బుగ్గి క్షణికమైనది*
*వుంటే ఎంత? లేకుంటే ఎంత?*
*సుఖంగా వుండు తమ్ముడూ!*
*సాగిపోతున్నా పయనమై.*

*- భగత్ సింగ్*

## అమ్మ ఒడి - పి. వెంకటరత్నం

సూర్యోదయానికి
బయపడిన చలి
గదుల్లో దాక్కునేందుకు
ఇంటి చూరుల్లోంచి
కిటికీ సందుల్లోంచి
జాగా వెదుకుతూ
జాగర్త పడుతోంది

ధైర్యం చాలని
చలిమంట
పొగతో ముఖం
కప్పుకుందిచలిమంట వద్ద
మనుష్యుల వెనక్కి వెళ్ళి
దాక్కుంది చలి
చలిమంట
చాటుగా నవ్వుకుంది

ముందు వేడి
వెనుక చలి
వణుకు ఇంకా
ఎక్కువై

ఛా! ఎందుకొచ్చాను
కంబళిని విడిచి
అనుకుంటూ
మనిషి.

మళ్ళీ ముడంకె
వేసేందుకు
గది మూలకే

వెళ్ళాడు

అప్పటికే
తిష్టవేసిన చలిని
చూచి కంబళి
దిగులుగా నిమ్మకుంది
వేడి లేక
గది మిన్నకుంది

మనిషి దేహం
మెలికలు తిరిగి
అమ్మ ఒడిని
తలుచుకుంది

అమ్మ ఆలోచన రాగానే
చలి ఏమైందో
మనసులో
వేడి పుట్టడం
ఆరంభమైంది

చలికి వెన్నుల్లోంచి
చలి పుట్టడం
ఆరంభమై
గది ఉండలేక
గల్లంతైంది.

## మనుషులు అన్నం తినడం లేదు - కొండేపూడి నిర్మల

మీట నొక్కారు
ఇల్లు కూలిపోయింది
మధ్య గదిలో పెద్ద అగాధం
అన్నాలు తింటున్న వాళ్ళు తింటున్నట్టే

బొమ్మ లై పోయారు
చేతిలో వున్న ముద్ద నోటికి అందడం లేదు
నోటిలో ముద్ద గొంతు దిగడం లేదు

ఒకప్పుడు
ఇదే భోజనాల గది బంధువుల కబుర్లతో
కొసరి కొసరి వడ్డిం చే రుచులతో ఘుమ ఘుమ లాడేది
పిల్లల చదువులు,పెళ్ళిళ్ళు,ఇంటి సమస్యలు,వేధి తమాషాలు
అన్నిటి మీదా చర్చలు జరిగేవి
అప్పుడప్పుడు పిల్లలు అలిగితే పెద్దలు బుజ్జగించేవారు
పెద్ద లు కొపిస్తే పిల్లలు నవ్వించే వారు
భోజనం ప్రశాంతం గా,సంతొషం గా
ప్రేమకు ప్రతిరూపంగా వుండాలని అం దరూ నమ్మేవారు
వం ట పట్టిన ఉప్పూ కారమ రుచులతో మనుషులు ప్రవర్తించేవారు
ఇప్పుడు కూర గిన్నెలో హత్య
సాం బారు గిన్నెలో జుగుప్స
పచ్చడి గిన్నెలొ భీభత్సం
మనుషులు అన్నం తినడం లేదు

## మారిన దూరప్రయాణాలు - జాన్ హైడ్ కనుమూరి

ప్రస్తుత దూర ప్రయాణాలు
రాత్రులకు అలవాటు పడ్డాయి
ప్రయాణిస్తూ నిదురోవచ్చు
నిదురోతూ ప్రయాణించొచ్చు
దూర ప్రయాణాన్ని పగటికి మార్చి
నిద్రపోలేని ప్రయాణం
కిటికీలను ఛేదించుకుంటూ వచ్చే
ఎండపొద నుండి
మెలమెల్లగా తప్పుకుంటూ
అప్పుడప్పుడూ
ఎదురయ్యే వాహనాల రొద వింటూ

మేల్కొన్న ఊర్లతో కళ్ళతోనే సంభాషిస్తూ
దాటుకుంటూ
గమన ఆగమనాల మధ్య
ఎక్కే దిగే ప్రయాణికుల్ని గమనిస్తూ
గమ్యం నగరం వైపు

నక్షత్రాల గుంపుల కోసం
జాబిల్లి తలుపు తెరచి చూసే వేళకు
గూటికి చేరాలని
ప్రియసఖితోనో
చిట్టితల్లులతోనో పంచుకోవాలని ప్రయాణం

తిరిగే చక్రం
ప్రగతికి చిహ్నమన్నట్టు
పరుగెడుతున్న బస్సు చక్రానికి
ఆలోచనల్ని బిగించుకొని
ఒకటే చక్రభ్రమణం

నా చుట్టూ నేనే!
నీ చుట్టూ నేనే!!

చింత తోపుల మధ్య పరుగెడుతున్న బస్సు
ఆలోచనల్ని జ్ఞాపకాల్ని
కాయలకో కొమ్మలకో తగిలించి
పరుగెడుతూనే వుంది

ప్రయాణభారమంత
కట్టెలమోపు
కళ్ళల్లోంచి గుండెల్లోకి దింపుకుంటూ... నేను
హఠాత్తుగా ఏర్పడ్డ అల్పపీడన వర్షంలా
మనసంతా ఒకటే చిత్తడి చిత్తడి
ధారలు ధారల కనుల వర్షం
ఏదో తెలియని అలజడి

బహుశ
ఎన్నో ఏండ్లుగా
గుండె లోతుల్లో
'నిన్ను ప్రేమిస్తున్నాను' ప్రియుడా!

వొంపులు దేరుతున్న దేహసౌర్యాన్ని
పొగడుతున్న అల్లిమిల్లి మాటలకు
మోహించి పరవశించి
నీ ప్రేమను చీదరించానేమో!

హంసతూలికా తల్పాలను కలగంటూ
కుక్కి మంచాలను కాలతన్నాను

నన్ను ఆరాధిస్తున్న కళ్ళ తడిని
పసిగట్టలేని పొరలేవో కమ్మేస్తూనే వున్నాయి.

అది

ఉదయమో

సాయంత్రమో

గేదె తోకల్లె వేలాడి వోగుచేసిన

పేడను పిడకలు చేసి

నాల్గునూకల గంజి కోసం

మండటాన్ని చూస్తున్నాను

వెలిగీ వెలగని పిడకల్లోంచి

రేగే పొగలో వర్షిస్తున్న కళ్ళను చూస్తున్నాను

తురతురమంటూ కాల్తున్న చితుకులుగానో

కణకణమండే నిప్పుకణికల కట్టెగానో

కాలిపోయిన సజీవ కట్టెలు చూస్తున్నాను

యెప్పుయి మొద్దు నుంచేనా

ఎండిన కట్టెల్లోంచి చిగురు పుట్టదా?

( కత్తి పద్మారావు రాసిన "కట్టెలమోపు" కవిత చదివిన తర్వాత రాసాను. )

## మెరిట్! :కవిత ముందుమాట - వరవరరావు

నేనీసారి జైల్లో ఉన్న కాలంలోనే, ప్రభుత్వరంగంతో పాటు ప్రైవేటురంగంలో కూడ విద్యా ఉపాధి అవకాశాలు జనాభా ప్రాతిపదికపై ఒబిసిలకు ఎస్‌సి ఎస్‌టిలకు కల్పించే విధంగా అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించాలనే ప్రజాస్వామిక ఉద్యమం ఊపందుకుంది. ముస్లింలకు రిజర్వేషన్లు, ఎస్‌సి వర్గీకరణల ప్రజాస్వామిక అవసరాన్ని కూడ ఇంచుమించు అన్ని రాజకీయపార్టీలే కాదు, ప్రభుత్వాలూ ఆమోదించక తప్పని స్థితి ఏర్పడింది.

ఇది అగ్రవర్ణాలకు, కార్పొరేట్ సంస్థలకు, వాళ్ల గుప్పిటలో ఉన్న మీడియాకు మింగుడుపడడం లేదు. ఒబిసి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన స్వభావం సారాంశమిది. యూత్ ఫర్ ఈక్వాలిటీ పేరుతో, యాంటీ రిజర్వేషన్ ఫోరం హైదరాబాద్ చాప్టర్ పేరుతో ఇపుడీ అగ్రవర్ణ వికృత అహంకార సంస్కృతి తెలుగునేల మీదికి కూడ మళ్లీ ప్రవేశిస్తున్నది.

1986లో మొదటిసారి ఎన్‌టిఆర్ ప్రభుత్వం ఒబిసిలకు విద్యారంగంలో ఉన్న 25శాతం రిజర్వేషన్లను 40శాతానికి పెంచింది. చిత్తశుద్ధితో కాదు, ప్రజాకర్షక చర్యగా. అయినా హైకోర్టు ఆ చట్టాన్ని కొట్టివేసేదాకా అగ్రవర్ణ విద్యార్థులు, ముఖ్యంగా వైద్యవిద్యార్థుల నాయకత్వంలోనే ఆ పెంపుదలకు వ్యతిరేకంగా ఆందోళన చేసారు. అచ్చంగా ఇపుడు ఢిల్లీ, పాట్నా వంటి నగరాల్లో ఎయిమ్స్, ఐఐటి వంటి సంస్థల అగ్రవర్ణ విద్యార్థులు చేస్తున్నట్లే. కనుక ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు ఇది మూడో మండల్ వ్యతిరేక ఆందోళన అవుతుంది - ఐక్యంగా ప్రజాస్వామ్యవాదులు అడ్డుకోకపోతే.

విచిత్రమైన సన్నివేశమేమిటంటే ఈ ఇరవై ఏళ్లలోనే ఎన్‌టిఆర్‌తోనే ప్రారంభమై విద్యా, వైద్యరంగాలు ఆంధ్రప్రదేశ్‌లో వేలంవెర్రిగా ప్రైవేటీకరింపబడినాయి.

కులముగలుగు వారు
గోత్రంబు గలవారు
విద్యచేత విర్రవీగువారు
పసిడిగలుగు వాని బానిస కొడుకులు

అని వేమన చెప్పినట్లు కొనితెచ్చుకున్న 'ప్రతిభ' బండారాన్ని మనం బట్టబయలు చేయాల్సి ఉంది. ఆ ఆకాంక్షతోనే ఇరవై ఏళ్ల క్రితం, అపుడుకూడ జైల్లోనే రాసిన డాయిూవు (ఇపుడున్న పరిస్థితి ఇదివరకే అనుభవించామన్న, ఎద్దుకు కాడి వంటి, చిరపరిచితమైన విసుగైన విషయం) (కవితను శీర్షికతో సహా చిన్న చిన్న మార్పులతో మళ్లీ ఈ సంకలనంలో చేరుస్తున్నాను.)

## మెరిట్!

- వరవరరావు

అదృష్టవంతులు మీరు
పెట్టి పుట్టారు
మీ భాషలో చెప్పాలంటే
నోట్లో వెండియు బంగారు చెమ్చాతో పుట్టారు

మీ ఆందోళన సృజనాత్మకంగా ఉంటుంది
మా ఆవేదన హింసాత్మకంగా కనిపిస్తుంది

మీరు ప్రతిభాశాలురు
కార్పోరేటు టీవీల్లో
కలర్‌ఫుల్‌గా లాఠీదెబ్బలు తినగలరు
దినపత్రికల మొహాలమీద సూర్యకిరణల్లా
అచ్చయ్యేంత అందంగా
బస్సుల అద్దాలు పగులగొట్టగలరు
ప్రశంసాపూర్వకంగా ముక్కున వేలేసుకొని
చెక్కిలి రైఫిల్‌పై ఆనించి పోలీసులు చూస్తుండగా
టైర్లలో గాలి తియ్యగలరు
రోకళ్లు ఎక్కించే పోలీసుస్టేషన్‌కు వెళ్లి
రాఖీలు కట్టగలరు
పైసలు లేకకాదు గదా మీరు బస్సుల్లో టికెట్లు కొనంది
అది ప్రయోగాత్మక నిరసన

ఈ అందమైన రోడ్లన్నీ రాస్తా రోకాయించినా మీవే
సేవ్ మెరిట్ స్టిక్కర్ల వాహనాలు ప్రవహించినా మీవే
వట్టికాళ్ల డాంబర్ మొహాల చెమట కంపు
రోడ్డురోలర్లం మేం నిర్మిస్తే మాత్రం
ప్లాన్ వేసిన ప్రతిభ మీది
కాంట్రాక్ట్ క్రెడిట్ మీది

మీది ఎంత అందమైన ఆందోళన
మీ ఆడపిల్లలూ తోడయిన మొగపిల్లలూ
అపురూపమైన అల్లరి చేస్తూంటే
తల్లిదండ్రులకూ పెద్దలకూ అన్నలకూ ముద్దే
ప్రదర్శించే మీడియాకు ఒళ్లంతా పులకింతలు
ప్రతిభ సమాధి అయి భవిష్యత్తు అంధకారమైందని
ప్రొటెస్ట్‌గా - చెట్టాపట్టాలేసుకొని యువతీయువకులు
పిక్నిక్‌కి పోవడం
యారో ఎంత హీరాయిక్‌గా ఉందని!
మెరిట్ పందెంలో మరాథన్ రన్నర్‌లు మీరు
తాంబేలుగాళ్లం
మీతో పోటీపడగలమా?

మీరు వాయమ్మినా పల్లీలమ్మినా బూట్‌పాలిష్ చేసినా
చందా 'మామా' అంటూ
మారుతీ కారుకో, ప్రియా స్కూటర్‌కో
వయారంగా అడ్డంపడినా
దొడ్డబుద్ధుల మీడియా గనుక
వాటి కెమెరాల గుండెలు క్లిక్కుమన్నాయి
స్వరాల్లో కలాల్లో యవ్వన ప్రతిభ కళాత్మకంగా కలవరించి
పరవశించింది
అవును మీరు సమానత్వం కోసం నడుంకట్టిన యువతరం కదా
దేబె మొహాలం
రోజూ వచ్చిన గొడ్డు కౌజు కంపులో కూలబడి
చెప్పలు కుడతాం
మా నెత్తురుతో రంగు పూస్తాం
కుంకుతున్న సూర్యునివంటి
మా కళ్ళలోని కాంతితో పాలిష్ చేస్తాం
అయినా బూట్లు వేసుకున్న వాడు బూటుపాలిష్ చేయడంలో
ఉన్న సృజనాత్మకత వేరు

మీ మనుషుల మలమూత్రాలు
ఎత్తిపోస్తాం నెత్తిమీద బకెట్లతో ఎత్తుకపోతాం
మీ టాయిలెట్ మొదలు డ్రాయింగ్ రూం వరకు
మీ శరీరాలు అరగదీసి కడుగుతాం

ఊడుస్తాం తుడుస్తాం
మా చేతులు చీపుర్లవుతాయి
మా చెమట నీళ్ళవుతుంది
మా నెత్తురు ఫినాయిలవుతుంది
మా ఎముకలు వాషింగ్ పౌడర్లవుతాయి
కానీ ఇదంతా వొట్టి బండచాకిరే
ఇందులో ప్రతిభ ఏముంది నైపుణ్యమేముంది

మీ టక్ చేసుకున్న వాళ్ళు మినీస్కర్ట్సు వేసుకున్న వాళ్ళు
జీన్సూ హైహీల్సూ సిమెంట్ రోడ్డుపై చిరుహాసంతో చిమ్మితే
అది ఆకాశవాణి సందేశమై
టీవీ దృశ్యమై మైమరపిస్తుంది
మేం రిక్షావాళ్ళం హమాలీలం తోపుడుబళ్ళవాళ్ళం
చిల్లర దుకాణాల వాళ్ళం గుమాస్తాలం
అస్పృశ్యులం ఆదివాసీలం ఒబిసిలం
ముస్లిం మైనార్టీలం
బిడ్డ పాలనకోసం ఆకలితో కొరికినా
నెత్తురు రాని తల్లులు
ఆస్పత్రి క్యూలలో నిలబడి
కూటికోసం నెత్తురమ్ముకుంటాం

ఆకలీ దరిద్రం చెమట వాసనే తప్ప దానికి
మీ ప్రతిభశాలుర రక్తదానం లోని దేశభక్తి పరిమళమెలా
అబ్బుతుంది

మీరేం చేసినా
ఊడ్చినా బూట్ పాలిష్ చేసినా

రైల్వే స్టేషన్ లలో బస్టాండులలో సామాన్లు మోసినా
తోపుడుబళ్ళలో పళ్ళమ్మినా
ఫుట్ పాత్ లపై చాయమ్మినా
షేవ్ మెరిట్ నుంచి సేవ్ మెరిట్ అని
ప్లే కార్డులు పట్టుకొని
క్రికెట్ లోనూ రిజర్వేషన్లుండాలని వెక్కిరించినా
కాన్వెంటు ప్రొనన్సియేషన్ స్లోగన్ల
ప్రొసిషన్లు తీసినా
మా సహస్రవృత్తుల శ్రమైక జీవనం
మీ ప్రతిభకు సాటిరాదని చెప్పడానికేనని మాకు తెలుసు

షిఫాన్ చీరల మీదా పంజాబీ దుస్తుల మీదా
తెల్లకోట్లు వేసుకొని నోటికి నల్లరిబ్బన్లు చుట్టుకొని
స్టెత్ వేళ్లాడే గుండెలమీద
సేవ్ మెరిట్ స్టిక్కర్లు తగిలించుకొని
ఎయిమ్స్ లాన్స్ లో మెరుస్తున్న
సగం కన్నా ఎక్కువే ఉన్న మీ స్వర్గాన్ని చూస్తుంటే
మీలోని క్రీమీలేయర్ దాటినోళ్ళకూ
రిజర్వేషన్ల జీవో
తొలగిన స్వర్గం తొణికిన స్వప్నం మాత్రమే కాదు
విరిగిన ఇంద్రధనస్సు కూడా

మావోడు చెప్పిన మాయమాటలు నమ్మాము గానీ
మాకు మిగిలింది శూన్యాకాశం కనుకనే
మా ఆడోళ్ళెప్పుడూ అందుకోసం నేలవిడిచి ఎగబడలేదు

మీది
భూతలస్వర్గంలో ఊహాల ఉద్యమం
అందుకే అమృతం హక్కు కోసం
దేవతలే ఎక్కువగా తెగించారు
మీ పంక్తిన కూర్చుంటే మాత్రం
రాహుకేతుగాళ్ళం మాకేం దక్కుతుంది

మాది మరణాంతక జీవన సమరం గానీ
మీ ఉద్యమం నిజంగా గొప్పింటి పెళ్ళిలాగే ఉంది
మీరలిగితే పెళ్ళి అలకలాగుంది
మీరు ఫర్నిచరో పాలకేంద్రమో తగులబెడితే
బాణాసంచా కాల్చినట్టున్నది
మీరు ‘బంద్ ‘ చేస్తే
దొరఇంట్లో పెళ్ళి ఊరికంతా పెళ్ళిలాగున్నది

మీఅహింసా సత్యాగ్రహాలు
ఎరవాడ జైలులో అంబేద్కర్ మీద అలిగిన
గాంధీగారి మహాత్మ్యాన్ని మరిపిస్తున్నవి

మీరదృష్టవంతులు
మీ ప్రతిభశవం నగర రాజవీధుల గుండా ఊరేగి
సంస్కృత మంత్రోచ్చాటనలతో
చౌరస్తాలో దహనసంస్కారాలు జరుపుకుంటుంది
ప్రతిభకు చావులేదు గనుక
వీరు సృజనాత్మకంగా శవయాత్ర నిర్వహిస్తారు
దుఃఖాన్ని అభినయిస్తారు

మాకు
చావడానికైనా చంపబడడానికైనా
ప్రతిభ ఉండిచస్తే కదా
కష్టం చేసో నేరం చేసో
ఆకలితోనో రోగంతోనో ( ఆకలి రోగమంటే ప్రతిభాశాలురు ఒప్పుకోరు )

నిరుద్యోగంలోనో ఉద్యమంలోనో
లాకప్ లోనో ఎన్ కౌంటర్ లోనో
( అసమానతే హింసలంటే ప్రతిభాశాలురు ఒప్పుకోరు )
చచ్చిపోతాం
ఏ రోడ్డువారనో ఏ చీకటి గొయ్యిలోనో

ఏ పెంటకుప్పమీదనో ఏమూరుమూల అడవిలోనో
విసిరివేయబడుతాం
దాఖలా మిగలకుండా బూడిదవుతాం
కొండకచో బొందలో నుంచి అదృశ్యమవుతాం

అయినా మా చావుపుట్టుకలు
జనాభా లెక్కలకు తప్ప
జాతి పురోగతికేం పనికొస్తాయి
దరిద్రంబాధకి తట్టుకోలేక పుట్టేవాళ్ళం
దరద్రం బాధకి తట్టుకోలేక గిట్టేవాళ్ళం

ధర్మానికి గ్లాని జరిగినప్పుడు అవతారమెత్తి
పనిముగియగానే చాలించే
సూత్రధారులు మీరు
అదృష్టవంతులు ప్రతిభాశాలురుమీరు

( 'అంతస్సూత్రం' కవితా సంపుటం, ప్రచురణకాలం 2006 జూన్ )

## నీవు మారేదెప్పుడు? - మాదిగ సాంబయ్య గుండిమెడ

ఆడ్ని
ఆ ...నల్లోడ్ని
మా యూనివర్శిటి గేటుముందు కుక్కలా కాపాలా కాస్తున్న ఆ...నల్లోడ్ని
మా లైబ్రరీ తలుపు ప్రక్క నిలబడి గూర్ఖాకాస్తున్న ఆ...నల్లోడ్ని
నేను లండన్నొచ్చినప్పట్నించి చూస్తున్న

ఆడ్ని
ఆ ... నల్లోడ్ని
పొద్దున్నే ఆరుగంటలకు మిషన్ చీపురుచ్చుకొని
బిటీష్ లైబ్రరీ ముందు ఊడ్చే ఆ ... నల్లోడ్ని
నేను లండన్నొచ్చినప్పట్నించి చూస్తున్న

దాన్ని
ఆ ... నల్లదాన్ని
ఫైవ్ స్టార్ హోటళ్ళల్లాంటి మాహాస్టళ్ళలో
టాయిలెట్లు క్లీన్ చేసే ఆ ... నల్లక్లీనర్ ని
నేను లండన్నొచ్చినప్పట్నించి చూస్తున్న

ఆళ్ళని
ఆ ... నల్లోల్ని
రాత్రి ఎనిమిది గంటలనుండి తెల్లారి ఎనిమిది గంటలదాకా
తెల్లోడి సూపర్ మార్కెట్లలో
సల్లటి సలిలో సరుకులు సర్దుతున్న ఆ ... నల్లోల్ని
నేను లండన్నొచ్చినప్పట్నించి చూస్తున్న

దాన్ని మా ... ముసిలమ్మని
పొద్దుటేళ పాపయ్యగారి పొలంలో కలుపుతీసి
సంధ్యపేళ కోటేశ్వరరావుగారి దొడ్లో అంట్లు కడిగే
మా ... ముసిలమ్మని

నా సిన్నప్పట్నుంచి సూస్తున్న

ఆడ్ని
ఆ ... యానాది కిట్టప్పగాడ్ని
అయినోరి యిళ్ళల్లో పెళ్ళిలపుడు ఆకులెత్తి
ఆరి దొడ్లో రోజూ దొడ్లు కడిగే
ఆ ... యానాది కిట్టప్పగాడ్ని
నా సిన్నప్పట్నుంచి సూస్తున్న

ఆళ్ళని
ఆ ... పాకీ వందనాన్ని, ఆడి పెళ్ళాం సుశీలమ్మని
మావూరి పంచాయితీ రోడ్లు ఊడ్సి
సైడుకాల్వల్లో పెంట ఎత్తేసే
ఆ ... పాకీ వందనాన్ని, ఆడి పెళ్ళాం సుశీలమ్మని
నా సిన్నప్పట్నుంచి సూస్తున్న

నేను లండన్నొచ్చి
నాలుగేళ్ళయ్యింది
గూర్ఖకాసే ఆ ... నల్లోడు
టాయిలెట్లు క్లీన్ చేసే ఆ ... నల్లక్లీనర్
సల్లటిసల్లో సరుకులు సర్దే ఆ ... నల్లోళ్ళు
యిపుడు లేరు.

ఆహ్
బిటీష్ దేశంలో
నల్లోడికి మంచిరోజులొచ్చాయన్న మాట
మా నాయనే!
ఎంత సల్లటి మాట సెప్పేవురా సిన్నోడా ...

రేయ్ ! ఎర్రినాకొడక !
'ఆ ... నల్లోళ్ళు' పోయార్రా
కాని

ఆళ్ళ జాబుల్లోకి యిపుడొచ్చింది కూడా
ఆ నల్లోళ్ళేరా
బహుశా ఆళ్ళ పిల్లలయివుండోచ్చు
ఎట్టెట్టా....

నాకు ముప్పై ఏళ్ళు దాటాయి
కలుపు తీసే మా ముసల్ది
దొడ్లుకడిగే ఆ యానాది కిట్టప్పగాడు
పాకీ పనిచేసే ఆ వందనం, ఆడి పెళ్ళాం
అందరూ యిప్పుడు రిటైరైపోయారు

పోన్లే అయ్యా ...
ఆళ్ళు కట్టపడ్డా
ఆ నల్లోళ్ళ పిల్లల్లాగా ముసిల్దాని పిల్లలు లిక్కిపట్టలేదు
ఆ యానాది కిట్టప్పగాడి కొడుకో – కూతురో
ఫినాయలు డబ్బాతీసుకోలేదు
ఆ పాకోళ్ళ పిల్లగాళ్ళు సీపుర్లుచ్చుకోలేదు

రేయ్! మట్టి నా కొడుక !
యిప్పుడు ముసిల్దాని మనుమరాలు
అంటే నా సెల్లెలు లిక్కి పట్టిందిరా
యిపుడు కిష్టప్పగాడి కొడుకు
రామప్పగాడు డబ్బావుచ్చుకున్నాడురా
యిపుడు ఆ పాకోళ్ళ పిల్లల సేతికి సీపుర్లొచ్చాయిరా
అయ్యో ... బిడ్డా!

ఏమ్ రోయ్ !
యిపుడు బిటిపోడంటే
ఒక్క తెల్లోడేగాదు
మీ దేశంలో వందల సంవత్సరాలుగా
మీకు ఊడిగం చేస్తున్న
నల్లోళ్ళు కూడ

మీ తెల్లోళ్ళ
పిల్లలు యూనివర్సిటీల కెళ్ళి
లైబ్రరీలలలో సదువు కుంటుంటే
మరి ఆనల్లోళ్ళ పిల్లలు
యూనివర్సిటీల ముందు ఎందుక్కాపలా కాయాలా?
లైబ్రరీలలోని టాయిలేట్లు ఆళ్ళే
ఎందుక్లీన్ చెయ్యాలా?

తూ ... నీయబ్బ!
నీ రేసిజాన్ని, నీ వలసకంపుని
వదులు కున్నావు కాదు కదరా!

ఏపే
నా అందమైన బంగారు భారతదేశమా!
డాక్టరు కోర్సు చేస్తున్న గంగాధర శాస్త్రిగారి మనుమరాలు
హేమలతా దేపే నీ బిడ్డా?
కంప్యూటర్ ఇంజనీర్ కోర్సు చేస్తున్న బాపినీడు గారి మనుమడు
శ్రీనివాసర్రావే నీ బిడ్డడా?

మరి
మా ముసిల్దాని ముద్దుల మనుమరాలు
నా సిట్టి సెల్లెలు శాంతమ్మ నీ బిడ్డకాదా?
శాస్త్రి మనుమరాలి చేతికి స్టెతస్కోప్ ఎట్లావచ్చింది? మరి
మా ముసిల్దాని మనుమరాలి చేతికి లిక్కెట్లావచ్చింది?

ఆ... యానాది కిష్టప్పగాడి కొడుకు
రామప్పగాడు నీ బిడ్డడు గాడా?
ఆ పాకోని పిల్లలు నీ పిల్లలు కారా?
మరి ఆడి మనుమడి చేతికి కంప్యూటర్ మౌస్ ఎట్లొచ్చింది?
ఈళ్ళ పిల్లగాళ్ళ సేతులకు సీపుర్లేందుకొచ్చాయి?

తూ నీయవ్వ!

నీ సవతి తల్లి మాదిరి ప్రేమని
నీ కుల గజ్జిని ఎప్పుడు వదిలించుకుంటావే?"

లండన్ , 8 మార్చి, 2007

అంకితం: గురువర్యులు ఎండ్లూరి సుధాకర్ గారికి వినమ్రయంతో వారి ఏకలవ్య శిష్యుని తొలి కవిత.

## ఇనుము దొంగలు - ప్రశాంత్

సాయంత్రం బల్ల అయిపోయింది. జగదీష్‌కు లైఫ్ పడిందన్న వార్త అందరినీ విషాదంలో ముంచింది. జగదీష్ అందరినీ బెదిరించుకు తింటాడన్న పేరున్నా నర్మదా బ్యారక్ మొత్తం చలించిపోయింది.
లాకప్ సమయం దగ్గర పడుతున్నది. బైట చెట్ల దగ్గర నేను, చిచ్చా, రఘునాథ్, డూమోర్ కూర్చున్నాం. రోజులాగే చిచ్చా 'అకేలే హై చలే ఆవో జావో హెూ తుమ్' లత పాట పాడాడు.

పాత హిందీ పాటలైనా, పూరి జగన్నాథుని జానపద భక్తి పాటలైనా అద్భుతంగా పాడగలడు.
"బాబూ నాయుడు కా కిస్సా క్యాహై" అన్నాడు చిచ్చా.

అప్పటికే లాకప్ బెల్ అవడంతో ఆలోచిస్తూ బ్యారక్‌లోకెళ్ళాం. అంతకంటే మమ్మల్ని బాధించే విషయం అందరి దగ్గరా బీడీలు అయిపోయాయి. క్యాంటీన్ రావడం లేదు, ఇంటర్వ్యూలూ లేవు.
భోజనం తర్వాత బీడీలు ఉన్నవాళ్ళ దగ్గర ఎంత ప్రాధేయపడుతున్నారో నాయుడు, ఉప్పరాపల్లి సత్తిబాబు ఇంకా చాలామంది.

లాకప్ తర్వాత ఈభిక్షాటనా ఉండదు. సైగలే తప్ప అరుపులు వినపడవు. బ్యారక్‌ల మధ్య ఎడం ఎక్కువ. కోరుకొండ నాయుడికి ఇంటర్వ్యూలు రాక రెండు నెలలు దాటిపోతున్నది. ఎప్పుడూ నవ్వుతూ బ్యారక్‌లు తిరిగే నాయుడు కొన్నాళ్ళబట్టి అదోలా ఉంటున్నాడు.
బీడీ ముక్కల కోసం ఎంతమందిని ఎన్నిమార్లు ప్రాధేయపడతాడో చూస్తే మనసు వికలమౌతుంది. నాయుడే కాదు ఈ జైల్లో ముక్కల దొంగలందరి స్థితీ ఇదే.

రెడ్డి మాత్రం ముక్కల దొంగలని నానా బూతులూ తిడతాడు. రెడ్డి ఉద్దేశంలో వీళ్ళందరూ నేరాలు చేసేవారనీ, చేయకుండా ఉండలేరని, వాస్తవమేంటో చెప్పడానికి ఎంత ప్రయత్నించినా వినేవాడు కాదు. నిజానికి రెడ్డి జీవితం కూడా అంతే బాధాకరమైంది. ఎక్కడో మహబూబ్‌నగర్ జిల్లా ఆయనది. హత్య కేసుల్లో ఇరుక్కొని ఆ కేసుల నుండి బయటపడడానికి వకీళ్ళకు ఫీజులు కట్టడం కోసం విజయవాడ, విశాఖల్లో మోటార్‌సైకిళ్ళ లిఫ్టింగ్ కేసుల్లో పడ్డాడు.
విశాఖ జైల్లో ఎక్కువమంది ముక్కల దొంగలే ఉంటారు. అట్లాంటి ముక్కల దొంగల్లో నాయుడు కూడా ఒకడు. ఏ కారణం వల్లో కానీ తనకు ఎయిడ్స్ ఉందని ప్రచారం చేసుకొన్నాడు. రోజుల వ్యవధిలోనే గంగా, యమునా, కావేరి, స్నేహ సరోవరం అన్ని బ్లాకుల్లోకి పాకింది. నర్మదా సరేసరి. మధ్యాహ్నంపూట ఒంటరిగా కూర్చున్నపుడు మైకులో ఈ నదుల పేర్లతో బ్యారక్‌లను పిలిచినపుడు ఒకవైపు నవ్వొచ్చేది. బాధా కలిగేది. సజీవ ప్రవాహాల పేర్లు బతుకును స్థాణువు చేసే కారాగారానికి పెట్టడమేంటా అనుకొనేవాణ్ణి.

ఎయిడ్స్ ప్రచారంతో నాయుణ్ణి అందరూ ఒకలా చూడ్డం మొదలుపెట్టారు. ఎస్కార్ట్ పోలీసులకు కోర్టు దగ్గర నాయుడు భార్య, తండ్రి కలిస్తే వాళ్ళకూ విషయం చెప్పడంతో ఇంటర్వ్యూలు పెట్టడం మానేశారు. దీంతో నాయుడు కూడా ఎవరూ పలకరించని బెంగాలీ ఇస్మాయిల్‌లాగా అయిపోయాడు. నాయుడు స్వభావాన్ని ఎరిగి ఉన్న వారెవరైనా ఆ వార్త అబద్ధమని తెలుసుకోవచ్చు కానీ, రోజు జైలు హాస్పిటల్‌కు వెళ్ళడం మూలాన అందరికీ అనుమానం.

ఒకరోజు సాయంత్రం బల్ల తర్వాత బీడీ కోసం పూలచెట్ల మధ్య హడావుడిగా తిరుగుతున్నాడు. నాయుడుతో పాటు ముక్కల కేసు గోవిందూ ఉన్నాడు.

నాయుడి దగ్గరకెళ్ళి, ''ఏంటీ ప్రచారం'' అన్నాను.

''ముందో సిగరెట్టివ్వండి. లాకప్ కదండీ, రేపు తీరిగ్గా మాట్లాడదాం లెండి,'' అంటూ సిగరెట్ ముట్టించుకొని వెళ్ళిపోయాడు.

రెండు నెల్ల బట్టి ఇంటర్వ్యూలు లేకపోయినా జైలు చేస్తున్నాడని, మాటకారి మనిషని గోవిందు లాకప్ తర్వాత జైలు కబుర్లలో చాలాసార్లు చెప్పాడు.

ముక్కల కేసు గోవిందుకు పదిహేనేళ్ళ పైనే జైలు అనుభవం ఉంది. పాతా కొత్త జైళ్ళ సంగతులు, వార్డర్లూ, జైలర్లూ, సూపరింటెండంట్‌ల సంగతులు చాలా చెప్పేవాడు.

* * *

సబ్ జైలు మారి సెంట్రల్ జైలుకు వచ్చిన తర్వాత తోటి ఖైదీల పలకరింపుల్లో ఏం కేసు అనడిగితే, 'ముక్కల కేసండి' అనేవాళ్ళు. ఈ ముక్కల కేసులేంటో తెలియలేదు. స్నేహ సరోవరం బ్యారక్ మారి నర్మదా వచ్చిన తర్వాత హరికృష్ణ, నాయుడు, గోవిందు ముక్కల దొంగతనం గురించి చాలా చెప్పారు.

ముక్కలంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉండే ఇనుపముక్కలని, ఈ ఇనుప ముక్కల్ని కొనడానికి చుట్టుపక్కల ప్రాంతాల్లో స్క్రాప్ కొట్లుంటాయని, ముక్కల దొంగల్ని చాలాసార్లు వాళ్ళే బెయిల్ పెట్టి విడిపిస్తారని చెప్పారు. గాజువాక చుట్టుపక్కల ప్రాంతాల్లోని యువకులు వందలాదిమంది ఈ ముక్కల దొంగలై పోయారని చెప్పారు.

''నైట్ వెళ్ళామనుకో అనియా పదిహేనొందలు, రెండు వేలు. బరువులు మోస్తే ఇంకా ఎక్కువే అనియా,'' అన్నాడు హరికృష్ణ.

చాలా ఆశ్చర్యం అనిపించింది. ఇంత పెద్ద పరిశ్రమ, పరిశ్రమ అంటేనే అభివృద్ధికి నిదర్శనమైంది. అలాంటిది చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల్ని ఎట్లా నేరసామ్రాజ్యంలోకి దించింది. పరిశీలించదగ్గ వైరుధ్యంగా కనిపించింది. రోజు లాకప్ తర్వాత చాలా కబుర్లు చెప్పకొనేవాళ్ళం. వారించినా వినకుండా బూతు, అక్రమ సంబంధాల జోలి చెప్పంది ఉండేవాడుకాదు నాయుడు. ఆజ్యం పోసినట్టు చిరంజీవి బీడీ ఇచ్చి, వాయిదాకు వేసుకోవడానికి షర్టు, చెప్పలు ఇస్తానని చెప్పి మరీ చెప్పించుకొనేవాడు.

ఎంత మాట్లాడినా అలసిపోయేవాడుకాదు నాయుడు. నిద్ర వస్తున్నా, జైలర్ తిట్టినా నవ్వేసి మళ్ళీ బీడీ ముట్టించి సంగతులు చెప్పేవాడు.

బల్ల తర్వాత ఏ పనులూ ఉండవు కాబట్టి మరుసటి మధ్యాహ్నానికి నాయుడు విషయం మాట్లాడదామనుకొన్నాను. ఉదయం గిన్తీ, టిఫిన్ బల్ల, మేస్త్రీ అరుపులు చికాకైన వ్యవహారం.
మేస్త్రీ నాయుణ్ణి ఎంత తిట్టినా పట్టించుకోకుండా అందర్నీ నవ్విస్తూ, ''ఏటి డాడీ నువ్వు తిటేస్తే ఎలగా,'' అనేవాడు. చీపురు పట్టుకొని అలాగ తిరిగేవాడు.

మధ్యాహ్నం బల్ల అయిపోయింది. నా అలవాటు ప్రకారం చిచ్చా బ్యారక్‌కు వెళ్ళాను. బీడీ ముట్టించి ఖైనీ కోసం చిచ్చాకు ఒకటిచ్చాను. పాటందుకొన్నాడు.
''సుహానీ చాంద్‌నీ రాతే! హమే సోనే నహీ దేతె'' ఇంతలో నాయుడు ఊడిపడ్డాడు.
''ఏటండీ మీరేదో సిగరెట్టిస్తారనుకుంటే మీరూ బీడీయే,'' అన్నాడు నిరాశగా.
''రెండు రోజులైంది నాయుడు క్యాంటీన్ లేదు, సిగరెట్లూ లేవు,'' అన్నా.
అప్పటికే చిచ్చా లేచి, ''బేటా ఆప్ బాత్ జారీ రఖో మై జరా లేట్ తాహు,'' అంటూ దిమ్మెపై పడుకొన్నాడు.
చిచ్చా పేరు గౌరిప్రసాద్ పట్నాయక్. ఒరిస్సా. అద్భుతంగా పాడగలడు, ఆర్ద్రమైన మనిషి. పేదరికం వల్ల అత్యాశకు పోయి పంచలోహ విగ్రహాల కేసులో ఇరుక్కొన్నాడు. ఇంటర్వ్యూలు ఉండవు కానీ బల్ల తర్వాత ఇంటర్వ్యూల అనౌన్స్‌మెంట్ వినడానికి అదేపనిగా వెళ్ళి చెట్ల కింద కూర్చునేవాడు.

''ఎందుకు చిచా నీ కోసమైతే ఎవరూ రారు కదా ఎందుకంత శ్రద్ధగా కూర్చుంటావ్,'' అంటే,
''నై బేటా, మేరాతో కోయి ఆయెగానై. ఓతో పక్కా హై. కోయి ఇన్‌సాన్‌కా తో ఆయేగా, అగర్ ఓ నై సునాతో హమ్ బోలేంగే, ఓ ఖుషీ హెూజాయేగా,'' అనేవాడు. ''పర్‌సాంత్ బాబు ఇంత్‌జార్ కా పల్ బహుత్ కఠిన్ హెూతా హై,'' రోజుకు ఎన్నిసార్లు ఈ మాట అనేవాడో.
నాయుడు వచ్చి పిచ్చాపాటి మొదలుపెట్టేసరికి మధ్యాహ్నం ఒంటిగంట, చాయ్ టైమైంది. బందురాజు నాకు, నాయుడికి టీ పట్టి తెచ్చాడు. చాయ్ బీడీ కాంబినేషన్‌తో మాటలు మొదలుపెట్టాం. నేనే అన్నాను, ''ఏంటి నాయుడు ఈ ఎయిడ్స్ ప్రచారం,'' అని.
''అదో పెద్ద స్టోరీలెండి. మరది చెప్పాలంటే చాలా బీడీలౌతాయండి,'' అన్నాడు.
తప్పదు, ''సరే,'' అన్నాను.
రొమాంటిక్ కట్టుకథలు చెప్పి, బీడీలు సంపాదించుకొని పని గడుపుకొనే మనిషని కొంచెం పరిశీలించినా తెలిసిపోతుంది.
''ఏళ్ళ బట్టి జైలు చేస్తున్నానండి, చేసిన నేరాలు కొన్ని, చేయనివి కొన్ని. ఎప్పుడూ ముక్కల కేసే ఇంకోటేదీ లేదండి. మా గాజువాకలో చాలామందికి ఉన్నామండి ముక్కల దొంగలం. నాకు తెల్దుగాని కొన్ని వేలమంది అనుకుంటానండి. ఈ గోవిందుగోడు మా పెద్ద సీనీరండి. ఆడి పెళ్ళాం కూడా ముక్కల కెళ్తుందండి.

పట్టీసుకున్నారనుకోండి. అలాగ పని జరుపుకుని బయటపడుతుందండి గుంటది. గోవిందుగోడు పది, పదిహేనేళ్ళబట్టి పప్పే. రాడం, పోడం ఇదేనండి.
మరదేం చేస్తుందండి. నేనూ పాజ్జెలు చేసానండి. ఏడెనిమిదేళ్ళ బట్టి పప్పు తింటున్నానండి. కొన్నిసార్లు సేట్లుంటారు కదండి. ఆల్లే బేల్ పెట్టీసి వారండి. లేదనుకోండి, ఇలాగ ఉండిపోవడమే.

ఈమద్ది ఇద్దరు ముగ్గిర్తో డబ్బులడుక్కొని ముక్కలేయలేదండి. ఇదిగో పప్పు తినీస్తున్నానండి. ఆర్నెల్లబట్టి పప్పే. ఎవరూ రాట్లేదండి. మా నాన్న రాడు, నా పెల్లామూ రాదు. ఏటిసేత్తాం సెప్పండి. బెయిలు మాట అలాగొదిలీండి, బీడీలైనా ఇవ్వాలి కదండి అదీ లేదు. ఎవడో సినిమా డైరెక్టర్ వచ్చాడండి. ఆడికలాగా సొల్లు సెప్పీసి బోల్తా కొట్టిస్తే ఆడొచ్చాడండి ఇంటర్వ్యూకి.

ఎలాగుంటాది సెప్పండి. అందుకే మండిపోయి ఎయిడ్స్ ఒచ్చీసిందన్నానండి. అలగైనా బెయిల్ పెట్టీసి తీస్తారేమో అనీసి. ఇదిగో ఇక్కడె సిక్కొచ్చీసిందండి. నా పెళ్ళాముంది కదండి ఆ గుంటది ఆళ్ళమ్మగారింటికెళ్ళిందండి. ఆడు మానాన్న రాలేదండి. జైల్లో ఇంతేసి ప్రచారం మాత్రం జరిగిపోయిందండి. ఏటి సేత్తాం సెప్పండి,'' అన్నాడు.
''అయినా ఏటుందండీ కేసులూ, జైలు చేయడం, మళ్ళీ ముక్కలు. ఏం సుకం లేదండి. గాజువాక పోలీసులున్నారు కదండి నంజీకొడుకులు సెలలు సెలలు లాకప్పల్లో పెట్టీసి కొట్టేస్తారండి. ఏం సుకం లేదండి,'' ఈ మాట అంటున్నపుడు నాయుడు ముఖంలో నిరాశ, కసి కనిపించాయి.

సాయంత్రం బల్ల వరకు చాలా విషయాలు చెప్పాడు. ముక్కల దొంగతనం ఎంత సాహసంతో కూడుకొన్నదో చెప్పాడు.
ప్లాంట్‌లోకి వెళ్ళే రన్నింగ్ గూడ్స్ ఎక్కి భోగీల మధ్య దాక్కొని లోపలికెళ్ళడం, ముక్కలేసుకొని బండి ప్లాంట్ దాటిన తర్వాత బ్రేక్ వాక్యూమ్ తీసి దూకడం ఎంత ప్రమాదకరంగా ఉంటుందో చెప్పాడు. సిఐఎస్ఎఫ్ పోలీసుల్ని గమనించాలి, లేదంటే కేసులు, ఒళ్ళు హూనం. అట్లా ప్రమాదాల్లో, పోలీసుదాడుల్లో చనిపోయిన వాళ్ళను గుర్తు చేసుకొన్నాడు.
''మీరోసారి రండీ, పాత గాజువాకలోని అయిల్‌గాడెక్కడంటే చెప్పేస్తారండి. నన్ను ఆయిల్‌గాడంటేనే తెలుస్తుంది. మా ముక్కలోళ్ళందర్నీ పరిచయం చేస్తాను. రన్నింగ్ గూడ్స్‌లో ప్లాంట్‌లో కెళ్దాం.''
''ఈ ముక్కల్తో ఏటొస్తుంది చెప్పండి. వచ్చిందంతా ముండలకీ, మందుకి పోలీసులకే పోతుందండి. మళ్లీ వాయిదాలు, వారెంట్లూ. ఈ ఇన్ఫర్మేషన్‌గాళ్ళతో చిక్కు. మా ముక్కలోళ్ళే ఇన్ఫర్మేషన్ గాళ్ళండి. రెండేసినెల్లు, మూడేసి నెల్లు లాకప్పల్లో ఉంటాం కదండి. అలాగ ఇన్ఫర్మేషనగాళ్ళవుతారండి. ఏటిసేత్తాం పని గడవాలి కదండి. జైల్లోనూ ఇన్ఫర్మేషన్‌గాళ్ళెక్కువేనండి. అందులోని మన నర్మదాలో ఇంకా ఎక్కువండి. ఇన్ఫర్మేషన్ కోసమే కేసులు పెట్టీసి పంపిస్తారండి,'' ఇలా మాట్లాడుకొంటూనే బయటికెళ్ళాం. అటూ ఇటూ తిరుగుతూ

మాటలు కొనసాగించాం. మధ్యలో ఆకులమద్ది వెంకటరమణ కలిస్తే బీడీ కాల్చేసి నేనూ, చిచ్చా, రఘునాథ్ స్నానానికెళ్ళాం.
స్నానమయ్యేసరికి బల్ల వచ్చేసింది.

డైనింగ్ హాల్లో గొడవ, అరుపులు. స్పెషల్ బెల్లం కోసమో, చపాతి ముక్కల కోసమో. రొట్టె తినే ప్రాంతాలవాళ్ళు జైలుకొస్తే రోజు నాలుగేసి చపాతీలిస్తారు.
హిందీవాళ్ళకు చపాతి వస్తుందని మిగతావాళ్ళకు కోపం. అట్లా జైల్లో హిందీవాళ్ళు, తెలుగువాళ్ళ మధ్య విభజన. ఘర్షణ కొనసాగేది. బల్ల దగ్గర బెంగాల్ బబ్లూ శర్మ ఆధిపత్యం ఉండేది. దాంతో ప్రతిరోజు గొడవ.
చిచ్చాతో ఉంటే, ''ఏటండీ హిందీవోళ్లతో ఉంటారు?'' అనేవాడు గోవిందు.
బల్ల అయిపోగానే నేనూ, చిచ్చా, రెడ్డి ముగ్గురం ఆవరణలోకొచ్చాం.
అప్పటికే చిరంజీవి చెట్ల మధ్య కూర్చుని బీడీ కాల్చుతున్నాడు. ''ఏంటి చిరంజీవి ఆలోచిస్తున్నావ్,'' అంటే, ''ఏముంటాయండి, జైలు బాధలు. నా లవ్వు రాలేదండి ఇంటర్వ్యూకి. ఈ పూట వస్తుందనుకొన్నా. గోవిందుగోడి పెళ్లాముగాలేదుటండీ బాధపడిపోతున్నాడు,'' అన్నాడు.
''వచ్చీటపుడు దాంతో గొడవ పడ్డాడటండీ,'' అంటూ ముగించాడు.
లాకప్ అయ్యింది. రోజులాగే హరికృష్ణతో మాట్లాడుతూ కూర్చున్నా. హరికృష్ణ మాటల్లో తాత్వికత ధ్వనించేది. ఎంత ఇబ్బందికరమైన పరిస్థితినైనా చాలా సులభంగా, ఒత్తిడికి గురి కాకుండా పరిష్కరించేవాడు.
నేను బ్యారక్‌లోకెళ్ళిన మొదటిరోజు హరికృష్ణే ఆహ్వానించాడు. ''రా కూర్చో అనియా, మేమూ మీలాగే,'' అన్నాడు మెత్తగా.

అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. అన్‌లాకప్ సమయాల్లో నాకు తెలిసిన సంగతుల్ని లాకప్ తర్వాత హరికృష్ణతో రూఢీ చేసుకొనేవాణ్ణి. నాకెందుకో నమ్మదగ్గ మనిషిలా కనిపించాడు. వచ్చిన కొత్తలో తన వ్యక్తిగత విషయాలు కొన్ని అబద్ధం చెప్పినా రానురాను వాటి వెనకాల వాస్తవాలేమిటో చెప్పసాగాడు. మొదట్లో తనకు పెళ్ళి కాలేదన్నాడు, తర్వాత అయ్యిందన్నాడు. ఆ తర్వాత, 'లేదనియా, జ్యోతి అని గుంటుంది అది మా ఫ్రెండ్ భార్య. అలాగ సంబంధం ఏర్పడిందనియా, ఏటిసేత్తాం,' అన్నాడు.
హరికృష్ణే కాదు ఈ జైల్లో చాలామందికి పెళ్ళిళ్ళు కాలేదు కానీ వాళ్ళతో సంబంధమున్నవాళ్ళు ఇంటర్వ్యూలకోసం వస్తుంటారు.

రెడ్డి ఒకరోజు అన్నాడు, ''దొంగ కొడుకులకు గూడ వొస్తరాబై, వీళ్ళకేం ప్రేమలు బై,'' అనేవాడు.
రానురాను జైల్లోని మనుషులు గొప్ప ప్రేమికులుగా, అద్భుతమైన మనుషులుగా కనిపించారు.
* * *
రాత్రి పదకొండు దాటుతున్నది. జైలర్ రంగనాయకులు రౌండ్‌కు వస్తున్నట్టు బూట్ల చప్పుళ్ళు వినిపించగానే హరికృష్ణ అన్నాడు, ''దొంగనాకొడుకనియా, పడుకో.''

అంతసేపూ ముక్కల దొంగతనం గురించి గోవిందు జీవితం గురించి, తన అక్రమ సంబంధాల గురించి చాలాసేపు మాట్లాడాడు.
జైలుకు వెళ్ళిన కొత్తలోనే నేను గమనించింది జైలులో అసలు గడియారం ఉండదు. ఉదయంపూట అయితే వార్డర్ ద్వారా లేకపోతే నీడ ద్వారా టైమ్ తెలుసుకోవాలి. రాత్రి జైలర్ బూట్ల చప్పుడో, బ్యారక్ ముందు చార్ట్ పెట్టే వార్డర్ ప్రతి గంటకొకసారి సంతకం చేస్తాడు అదైనా తెలుపుతుంది. ఒక్కోసారి ఆ చార్ట్ కూడా కనిపించనంత దూరంలో ఉంచితే సమయం తెలియకపోవడం హింసగా ఉంటుంది. ఒక్కోసారి బాగా ఆలోచిస్తే తెలిసేది సమయం తెలియకపోవడం మాత్రమే మానసిక ఇబ్బందికి కారణం కాదు మనం అనుకొన్నది చేయలేని స్థితి వల్ల అని.

పడుకొనేముందు హరితో అన్నాను, ''గోవిందు అడిగితే చెబుతాడా,'' అని. ఆయన జీవితం గురించి అన్నాను. ''అడుగనియ్యా,'' అన్నాడు. మరుసటిరోజే వాయిదా కావడం వల్ల తీరుబాటు కాలేదు. రెండురోజుల తర్వాత గోవిందుని పలకరించి ఎప్పుడు కూర్చుందామని అడిగితే కళ్ళలో నీళ్ళు నింపుకొని మళ్ళీ తనే తమాయించుకొని, ''లాకప్ అయిపోద్ది కదండి. మాట్లాడదాం లెండి, చాలా ఉన్నాయి లెండి. ఓ పూటతో అయిపోవు కదండి,'' అన్నాడు.
''నంజీకొడుకు కృష్ణమూర్తిగాణ్ణి చూశారండి ఇళ్ళు దోసేసి నేరాలు సేసీసీ పప్పు తింటూ పిల్లి సచ్చిపోతేనూ పూడ్చేసి పూలేసి ప్రార్థన చేశాడటండీ,'' అన్నాడు.

దర్జాగా డెక్కన్ క్రానికల్ చదివే కృష్ణమూర్తికి ఇరవై మూడేళ్ళు ఉంటాయి కావచ్చు. సంవత్సరకాలం బట్టి నర్మదాలో ఉంటున్నాడు. పిల్లికి ఆరోగ్యం బాగుండక చెట్ల పొదల్లోనో, బాత్‌రూముల దగ్గరో పడుకొంటున్నప్పటి నుండి దాని ఆలనా పాలనా చూశాడు. అది చనిపోయిన తర్వాత పూడ్చి, పూవులేసి ప్రార్థన చేసొచ్చాడు. జైలులో పూజలు, ప్రార్థనలు, నమాజ్‌లు చేసేవాళ్ళు చాలామందే ఉన్నారు. జైల్లోని తోటలో రంగు రంగుల పూలు పూసేవి. వాటిని అందంగా అలంకరించి పూజలు చేసేవారు.

సిమెంట్ శివలింగం తయారుచేశారు. బబ్లూ శర్మ పూజ చేస్తే ఇస్మాయిల్ దండ గుచ్చేవాడు. ఇస్మాయిల్ తన దగ్గరున్న పలకపై మసీదు బొమ్మ గీసుకొని దాని ముందు నమాజ్ చేసేవాడు.
మామూలుగా జైల్లో మునిమాపనగా ఇంటర్వ్యూలు అయిపోతాయి. దాదాపు అటూ ఇటుగా లోకల్ కోర్టులు వచ్చేస్తాయి. ఔట్ కోర్టులు లాకప్ తర్వాత వస్తాయి.
ఒకరోజు ఔట్ కోర్టులకు వెళ్ళిన చిత్రసేన్ రెడ్డి, ఎరుకల అబ్బులు వస్తారని ఆ బ్లాకులవాళ్ళు అన్నం పట్టారు. చిత్రసేన్ రెడ్డి వచ్చాడు కానీ, అబ్బులు రాలేదు. అందరిలో గుసగుసలు మొదలయ్యాయి. అబ్బులుకు లైఫ్ పడే ఉంటుందన్న అభిప్రాయం చాలామందిలో ఉంది.

జగదీష్‌కు లైఫ్ పడ్డప్పటి నుండి అబ్బులు అందరికీ దూరంగా, మౌనంగా ఉంటున్నాడు.

ఊచల మధ్య నుంచి బయటకు చూస్తూ, బీడీలు కాలుస్తూ ఇదే విషయం మాట్లాడుతున్నాం నేను, గోవిందు.
"ఏటండీ చీమలమో, పిల్లులమో అయి పుట్టి ఉంటే బెయిల్, శిక్ష ఏవీ ఉండేవి కాదు గదండీ. అలా దూరేసి పారిపోదుము. జంతువుల్లా పుట్టకపోయామా అయినా మనిషిని మనిషి బంధించడం ఎంత దుర్మార్గమండీ," అన్నాడు.
గోవిందు మాటలు దు:ఖపెట్టాయి. ఈ గోడలు దాటాలని ఈ మనుషులు ఎన్ని ఆలోచనలు, ఊహలూ చేస్తారో అనిపించింది. మళ్ళీ అన్నాడు, "పక్షులమైతే ఇంకెంత హాయోనండి."
ఇంతలో అడ్మిషన్ అరుపు వినిపించి అటువైపు చూశాడు. ఆయనా ముక్కల దొంగే. ఆయన గురించి చెప్పడం మొదలుపెట్టి తన జీవితంలోకి వెళ్ళిపోయాడు.

"సరిగ్గా పదేళ్ళవుతుందండి. నేను మా బామ్మర్ది ఇప్పుడొచ్చాడు కదండి కొత్త అడ్మిషను, ముగ్గురం కలిసి నేరం చేయడానికెళ్ళామండి ప్లాంట్‌కు అటింకా పైకి. పెద్దపెద్ద ముక్కలు తీశామండి. బాడుగ ఆటో మాట్లాడాం. ముక్కలన్నీ ఏసేసాం. చివరి ముక్క ఉండిపోయింది. మా బామ్మర్ది గాడెళ్ళాడండి తేడానికని. ఇంతలో సేవీ వాళ్ళొచ్చి ఫైర్ చేస్సారండి. ఆడు పడిపోయాడు. మమ్మల్ని పట్టేసుకుని సుబ్బరంగా బాదేసి ఎటెమ్ట్ మడ్డర్ కేసు పెట్టేసి పప్పు కోసం పంపించేశారండి. ఇదిగో ఆ కేసేనండి ఇప్పుడు పప్పు తినిపిస్తుంది. పదిహేనేళ్ళ బట్టి చాలా నేరాలు చేశానండి. ముక్కలేననుకోండి. ఇంకేటి లేదు. పాజైలు, కొత్త జైలు అన్నీ చూశానండి. ఏం సుకం లేదండి. మీరేటండీ మేమూ సూసాం ఎన్‌కౌంటర్లూ," అంటూ భోరున ఏడ్చేశాడు.

"ఇదిలాగుంది కదండి, నా పెళ్ళాం ఇంకోడితో సంబంధం పెట్టుకుని లెగిసిపోయిందండి. నా బామ్మర్ది ఇంటిది, ఎవడూ సేవీ వోల్లు కాల్చేసారు కదా ఆడు. అది ముండల్లో కలిసిపోయి గోపాలపట్నం, ఎన్ఏడి జంక్షన్‌లో తిరగడం మొదలెట్టేసింది. ఏట్రా యిలగైపోయిందనుకుని అలాగా తాగుతూ ఉండిపోయాను. తప్పేదు కదండి మళ్ళీ పప్పు కోసం తినీడానికికొచ్చేసీ అలాగ ఎనిమిదేసి నెల్లుండి కేసు కొట్టేస్తే బయటపడ్డానండి. ఇంకేటండీ మళ్ళీ ముక్కలు. ముక్కలు దొంగతనం చేస్తునప్పడే గాజువాకలోని ఏది నేను సేసుకున్నాను కదండి గుంటది అది తగిలింది. అలా దాన్ని దువ్వేసి ఇంట్లో పెట్టేసుకున్నానండి. దాని భాష నాకు రాదు. నా భాష దానికర్థం కాదు. అదీ ముక్కలకొచ్చేది. భాష రాప్పోయినా పిల్లలకేటండి. పిల్లలయ్యారండి. ముగ్గురు. ఇంకేటి సేస్తాం దాన్నింట్లో పెట్టేసి ముక్కలకెళ్ళేవోణ్ణండి. చాలా మంచిదండి. ఇప్పుడు సూడండి నేను పప్పుకొచ్చేసి ఆరేసి నెల్లయిందండి. పిల్లల్ని అదే సూస్తుంది, మళ్ళీ ఇంటర్వ్యూలూ పెడుతుందండి. అదైనా ఎంతకని వొస్తుందండి. రెండు నెల్లబట్టి రాట్లేదు."
మనసులో ఇంత వున్నా బయటికేమాత్రం కనిపించనివ్వడు గోవిందు. ఎక్కువ మాట్లాడకుండా ఎప్పుడూ బ్లాకుల మధ్య వరండాలోనో, పూవులచెట్ల దగ్గరో దీర్ఘంగా ఆలోచిస్తూ పచార్లు చేస్తాడు. గోవిందు, హరికృష్ణ, నాయుడు, పోలయ్యే కాదు ఈ బ్యారక్‌లో ఉన్న దాదాపు వందమందిలో అందరి స్థితీ ఇదే. ఎవరూ బయటికి కనిపించనివ్వరు.

* * *

ఉగాది పండుగకు ముందో తరువాతో సరిగా గుర్తులేదు లాకప్ అయిన తర్వాత మాట్లాడుతూ కూర్చున్నాం నేనూ, గోవిందూ, హరికృష్ణ. చిరంజీవి బ్యారక్‌లోనే పచార్లు చేస్తున్నాడు. రాత్రి పది దాటింది. బయట వెన్నెల కురుస్తున్నది. జైలు చుట్టూ పచ్చని కొండలు. ఆవరణంతా ఎర్రమట్టి నేల కావడం వల్ల వెన్నెల నేలపై పడి చిత్రమైన కాంతి పులుముకున్నది. అద్భుతమైన దృశ్యం.

హరికృష్ణ అన్నాడు, ''అనియా బయట కూర్చుని అలాగ బీడీ కాల్చుకుంటూ అసుకేసు కుంటూ పాటలు పాడుకుంటే బలేగా ఉండేది కదనియా,'' అని.
ఇంతలో చిరంజీవి, ''తాళి కట్టు శుభవేళ మెడలో కల్యాణమాల,'' పాట పాడితే,
గోవిందు చిరాకు పడుతూ, ''ఒరే ఆపరా ఏడుపుగొట్టు పాటలు,'' అన్నాడు.
చిరంజీవి ఆ పాటలోని ''ఏనాడు ఏ జన్మకో రాసి ఉంటాడు విధి ఎప్పుడో,''చరణమే ఎక్కువ పాడేవాడు.
''ఏటండీ, ఈ జైలేటి, ఈ ముక్కలేటి ఈ బాదలేటి. మనకూ ప్లాంట్‌లో ఏదో పనిస్తే నేరాలెందుకు సెప్పండి, ఏటో...''
ప్లాంట్ పెడుతున్నపుడు పోయిన ఊళ్ళలోని వాళ్ళందరికీ ఏ ఉపాధి దొరకలేదు. ప్లాంట్ పడ్డ తర్వాత వాళ్ళంతా దొంగలైపోయారు.
''అనియా సంవత్సరంలో మూడు మాసాలు బయట, తొమ్మిది మాసాలు పప్పు. ఒక నేరం చేస్తే పది పోలీసులు పెట్టేస్తారు. ఏటి సేస్తాం. మా ముక్కల నేరాలన్నీ ఇంతే అనియా,'' అన్నాడు హరికృష్ణ.
చిచ్చా పాటందుకొన్నాడు.

''బాగ్‌తో జల్‌గయా / ఎక్ కలీ రహెగయీ
యాద్ దిల్ మే కోయీ / అధ్ జలీ రహెగయా''
పదకొండు దాటింది కావచ్చు. నైట్ రౌండ్ జైలర్ బూట్ల చప్పుడుకు అందరం పడుకుండిపోయాం.

## "వెంటాడిన అవమానం" కథ : దళిత వాస్తవిక జీవితం - మొదటి భాగం- డా దార్ల వెంకటేశ్వరరావు

1.0. ప్రస్తావన:

సమాజం వ్యక్తుల సమూహం. వ్యక్తుల మధ్య వైరుధ్యాలు కనిపిస్తుంటాయి. భారతీయ సమాజంలో వ్యక్తుల మధ్య ఏర్పడే వైరుధ్యాల్లో "కులం" ఒక అనివార్య సందర్భమయిపోయింది. క్రమానుగతి (Hierarchy),వేరుగా ఉండటం (Separation), పరస్పర ఆధారం (Interdependence) వంటి సూత్రాల ఆధారంగా కులం నిర్మితమవుతుంది .

ఒకే మూలపురుషుడు కలిగి, ఒకే ఆనువంశిక వృత్తిని పాటిస్తూ, అంతర్వివాహాలు చేసుకుంటూ ఒకే పేరుతో చెలామణి అయ్యే కుటుంబాల లేదా బంధుత్వ సమూహాల స్వాధర్మ్యం "కులం" అని సామాజిక శాస్త్ర వేత్తలు నిర్వచించారు . కులం వ్యక్తులకు శుద్ధి (Purity ), అశుద్ధి (Pollution) అనే గుణాన్ని ఆపాదిస్తుంది. తెగ (Tribe)కీ , కులాని (Caste)కీ కొన్ని సమాన లక్షణాల్లో ఉన్నా, "కులం" లో అశుద్ధి, అపవిత్రత వంశ పారంపర్యంగా మారి, అది వారిని శాశ్వతంగా అస్పృశ్యుల్ని చేస్తుంది. అంతే కాకుండా, అస్పృశ్యత అనేది భౌతిక, మానసికపరమైనది. వివిధ పనులు చేయటం వల్ల అది ఏర్పడుతుంది. దాన్ని "సంస్కారాల" రూపంలో తొలంగించుకునే అవకాశం ఉంది. కానీ, మానసికంగా ఏర్పడిన "భావన" మాత్రం అలాగే ఉండిపోయి 'అస్పృశ్యత" కొందరికి "అవమానం"గా పరిణమిస్తుంది. అది జీవితాంతం వెంటాడుతుంది. వంశపారంపర్యంగా వెంటాడుతుంది. కాసుల ప్రతాపరెడ్డిగారు "వెంటాడే అవమానం''పేరుతో ఓ కథ రాశారు . ఒక సామాజిక వాస్తవాన్ని తెలిపేది ఈ కథ. దళితుడికి జరిగే అవమానాన్ని సామాజిక ఉన్నత అంతస్తు (Ascribed Status)లో ఉన్న వాళ్ళు, సామాజిక నిమ్న అంతస్తు (Lowest Social Status) లో ఉన్న వాళ్ళని తమతో సమానంగా చూడటానికి ప్రయత్నిస్తే కలిగే ఆటంకాలను ఈ కథలో వర్ణించారు. దళితులను, దళితేతరులను ఆలోచింపజేసే అనుభూతి ఐక్యత (Unity of Impression) గల కథగా దీన్ని చెప్పుకోవచ్చు.

1.1. కథా సారాంశం :

ప్రశాంత్ రెడ్డి ఓ జర్నలిస్ట్. ఉద్యోగరీత్యా తన భార్యతో పాటు ఊరునుండి వచ్చేసి హైదరాబాదులో నివశిస్తుంటారు. వీళ్ళని చూడ్డానికి ప్రశాంత్ రెడ్డి తల్లి లక్ష్మమ్మ వస్తుంది. ఆ రోజు ఎందుకో తల్లిని తొందరగా తన సొంత ఊరుకి పంపేయాలనుకుంటాడు. అతని అంతరంగం భార్యకే తెలియక అత్తగారిని ఇంకొన్ని రోజులు ఉండమంటుంది. ఆ మాటనే అతన్ని కూడా చెప్పమంటుంది. ఆ మాటని పట్టించుకోకుండా ఆఫీసుకి వెళ్తున్నానీ, ఎండ ముదరకముందే బయలుదేరమనీ తల్లికి చెప్పి ఓ వంద రూపాయలు చేతిలో పెట్టి ఆఫీసుకు వెళ్లిపోతాడు. ఆతని తల్లి ఆ ఇంట్లో ఉండటం ఇష్టం లేకనో, ప్రేమ లేకనో కాదు. దానికి ఓ కారణం ఉంది.

ఆ సాయంత్రం భోజనానికి ప్రశాంత్ రెడ్డి ఇంటికి వస్తానని రాహుల్ చెపుతాడు. రాహుల్ది అతని ఊరే. వాళ్ళిద్దరూ ఒకే బడిలో చదువుకున్నారు. ఊరవతల గుట్టల్లో గంటలు గంటలు కూర్చొని మాట్లాడుకునే వారు. ''ఎల్లయ్య'' అనే పేరుని ''రాహుల్'' గా మార్చుకుంటాడు. బాగా చదువుకొని హైదరాబాదులోనే ఓ ఉద్యమంలో పనిచేస్తూ, ఈ మధ్యకాలంలో తనకి మళ్ళీ దగ్గరవుతాడు. అతడిని ప్రశాంత్ రెడ్డి ఎన్నోసార్లు భోజనానికి పిలిచేవాడు. రాహుల్ మాత్రం తర్వాత వస్తాననేవాడు. అలాంటి రాహుల్ ఆ రోజు భోజనానికి రావడానికి అంగీకరిస్తాడు. అతని తల్లిగానీ, తండ్రిగానీ ప్రశాంత్ రెడ్డికి ఎదురయితే ''దండాలు దొరా'' అని కాలు మొక్కుతుంటారు.

ప్రశాంత్ రెడ్డి తన భార్య వీణతో మాట్లాడేటప్పుడు , అప్పుడప్పుడూ రాహుల్ ప్రస్తావన వస్తుండేది. ఆమెకి కూడా రాహుల్ పట్ల జాలీ, సానుభూతి ఏర్పడిందని అతనికి అనిపించేది. ఆ ధైర్యంతోనే రాహుల్ని భోజనానికి రమ్మని పిలిచేవాడు. ఆ రోజు రాహుల్ వచ్చేటపటికి తల్లి తన ఇంటి దగ్గర లేకపోతే చాలనుకుంటాడు ప్రశాంత్ రెడ్డి. భార్య తనని అర్థం చేసుకుంటుందనుకుంటాడు. కానీ, ''నీకు బుద్ధి లేదు కాబట్టే మాదిగోడికి మంచంలో తిండి పెడతానంటున్నావు'' అంటుంది వీణ. ''అడ్డమైన వాళ్ళకీ వండి పెట్టనంటుంది. వండి పెడితే ఊరుకోనంటుంది''. ఇప్పుడేం చేయాలి? తన భార్యతో ఘర్షణ తప్పదా? తప్పలేదు. రాహుల్ వచ్చే టైమవుతుంది. రాత్రి ఏడున్నర తర్వాత వస్తాడు రాహుల్ . వచ్చీ రాగానే ''అక్క'' కనిపించటం లేదేమిటని అడుగుతాడు. ''జ్వరం వచ్చింది. పడుకుంది.'' అని ప్రశాంత్ రెడ్డి సమాధానం చెప్తాడు. ''అయ్యో డాక్టర్కి చూపించావా'' అంటాడు రాహుల్. తలూపి, ఆ తర్వాత కాసేపటికి ''హొటల్ కెళ్దాం పద'' అంటాడు ప్రశాంత్ రెడ్డి. ''చెప్పటం మరిచాను దారిలో పాత ఫ్రెండ్ ఒకతను కలిసి బలవంతంగా వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. భోజనం చేసిందాకా ఊరుకోలేదు. అందుకే రావటం ఆలస్యమయింది'' అని రాహుల్ సమాధానమిస్తాడు. ప్రశాంత్ రెడ్డికి ఏమి మాట్లాడాలో పాలుపోదు. ''సారీ'' అని మాత్రం అనగలుగుతాడు. రాహుల్ చేతిని దగ్గరగా తీసుకొని ప్రేమగా నొక్కుతాడు. ''ఎందుకింత ఇదయి పోతావు, మరోసారి తప్పకుండా ''అక్క'' చేతి వంట తింటా కదా!'' అంటూ, తనకేమీ జరగనట్లే కాసేపు ఉండి, బయలుదేరతాడు. అతనితో పాటు బయటిదాకా వచ్చి సాగనంపేస్తూ, రాహుల్ ఓ వ్యాసంలో రాసిన వాక్యాల్ని గుర్తుచేసుకుంటూ, అతను వెళ్ళే దారిని చూస్తూ నిలబడిపోతాడు ప్రశాంత్ రెడ్డి.
దీన్ని కింది విధంగా విశ్లేషించుకునే అవకాశం ఉంది.

1.2. దళిత వాస్తవిక జీవిత చిత్రణ :

''అంటరానితనం, సాంఘిక అణచివేత, ఆర్థిక పీడన, రాజకీయ అణచివేత, మనుషులుగా పరిగణింప బడకపోవటం, పశువులకన్నా హీనంగా చూడబడటాన్ని 'దళిత వాస్తవికత' '' అని డా.ఎస్వీ. సత్యనారాయణగారి అభిప్రాయం . కట్టుబాట్లు, నమ్మకాలు వంటివి దళితేతరుల జీవిత వాస్తవికతగా ఆయనే వివరించారు. వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు కథకు 'జీవితం ముడి సరుకు' అవుతుందని అంటారు. కథా వస్తువు రచయిత జీవితంలోనుంచి కానీ లేదా రచయితకు తెలిసిన ఇతరుల జీవితంలోనుంచి కానీ పుట్టవచ్చు

అనీ, ''కథలోని జీవితానికి ప్రాతినిధ్యం వహించగల పాత్రలని అదే జీవితానికి ప్రాతినిధ్యం వహించగలిగిన సంఘటనల్లో పెట్టి వాటి అంతరంగ, బహిరంగ జీవితాలనూ వాటి మధ్య ఉన్నసంబంధాన్నీ లేదా వైరుధ్యాన్నీ చిత్రించుటమే వాస్తవిక కథనం అవుతుందన్నారు. అలాగే '' పాత్ర మానసిక జీవితానికీ, భౌతిక జీవితానికీ మధ్య ఉన్న సంబంధాన్నీ లేదా వైరుధ్యాన్నీ చిత్రించుటమే నిజమైన వాస్తవికతా వాదం అవుతుందనిచెప్పారు.

ఈ అభిప్రాయాలతో పరిశీలించినా, ''వెంటాడే అవమానం'' వాస్తవిక దళిత జీవితం ప్రతిఫలించే కథే అవుతుంది. మారుతున్న సామజిక పరిస్థితులు, విద్యాఉద్యోగ అవసరాల వల్ల దళిత, దళితేతరుల మధ్య సంబంధాలు తప్పనిసరవుతున్నాయి. అయితే, ఈ బంధం అవసరార్థం ఏర్పడుతున్నా, యాంత్రిక మానవ సంబంధాలుగా కొనసాగుతున్నాయి. అంతే తప్ప భౌతిక , మానసిక అంతరాల్లో భేదాలు తొలగించుకుని కలిసి పోయే మానవ సంబంధాలు కాలేకపోతున్నాయి. దీని వల్ల దళితుల పట్ల జాలీ, సానుభూతీ, అర్థం చేసుకునే పరిస్థితి ఒక వ్యక్తికి కలిగినా, ఆ వ్యక్తికి కుటుంబంతో, సంఘంతో, సమాజంతో కొనసాగవలసిన పటిష్ట బంధానికి ఆటంకాలుగానే ఉనాయి. ఈ విషయాలను కథలో సృజనీకరించి వాస్తవికతను ప్రతిబింబించేటట్లు రాశారు. అందుకనే '' వెంటాడే అవమానం'' కథలో దళిత, దళితేతరుల మధ్య ఉండే సంబంధాలను కథలో పాత్రల మధ్య ఉండే గాఢతను పరిశీలిస్తే ''అనుభూతి ఐక్యత'' (Unity of Impression) అనే గొప్ప కథకుండే లక్షణం కనిపిస్తుంది. అంతే కాదు, కథా విమర్శకులు ఆశించినట్లు కథలో సంఘర్షణ ఉంది. '' ఇద్దరు వ్యక్తుల మధ్య, ఒకే వ్యక్తిలోని రెండు వ్యక్తుల మధ్యా, రెండు భావాల మధ్యా, రెండు వర్గాల మధ్యా, రెండు సిద్ధాంతాల మధ్యా, రెండు జీవిత దృక్పథాల మధ్యా ...'' ఇలా ఎన్నింటి మధ్యనైనా సంఘర్షణ ఉండాలని వల్లంపాటి అంటారు . ఈ కథలో కింది విధంగా ఆ సంఘర్షణను వింగడించుకోవచ్చు.

1. దళితులు - దళితేతరుల మధ్య సాంఘిక అసమానతల వల్ల సంఘర్షణ.
2. కలిసి మెలిసి జీవించే విషయంలో సాంస్కృతిక సంఘర్షణ.
3. దళితులు - దళితేతరలు కలిసి మెలిసి జీవిస్తే భౌతిక, భావనావాద సిద్ధాంతాల్లో వారు దేన్ని అనుసరించి జీవించటంలో నిర్ణయించుకునే సంఘర్షణ.

పై మూడింటిలో మొదటిది సాంఘిక, ఆర్థిక కోణాలకు చెందిన సంఘర్షణ. మిగిలిన రెండు అన్ని వర్గాలూ కలిసి మెలిసి బతకటంలో కలిగే సంఘర్షణ ఈ కథలో ప్రశాంత్ రెడ్డికి - కుటుంబంలో తల్లి, భార్యకి మధ్య సైద్ధాంతిక, సాంస్కృతిక ఘర్షణ కనిపిస్తుంది. అది వీణ - ప్రశాంత్ రెడ్డిల సంభాషణల్లో వ్యక్తమయింది. దీనివల్ల ''వీణ''లో భావవాదం, గతానుభవాల వల్ల వచ్చింది. రాహుల్ జీవితంలో భౌతికవాదం కనిపించటానికీ గతానుభవాలే కారణమవుతున్నా, పూర్తిగా ''భౌతికవాది''గా కనిపించకపోయినా, కత్తి పద్మారావు వంటి వారు అంబేడ్కర్ ఆలోచనా విధానంగా ప్రచారం చేస్తున్న ''ప్రత్యామ్నాయ సంస్కృతి'' లో భాగంగానే హిందూ కుల సమాజంలో కనిపించే పేరు ''ఎల్లయ్య''ను తల్లితండ్రులు పెడితే, అతడు రాహుల్ అని మార్చుకుంటాడు. రాహుల్ అనేది అంబేడ్కర్ నమ్మిన భౌద్దిజానికి సంబంధించింది. కుల నిర్మూలనకు భౌద్ధ దీక్షను తీసుకుంటాడు డా.బి.ఆర్.

అంబేడ్కర్. ఇవన్నీ దళితుల ప్రత్యామ్నాయ సంస్కృతికి జరిగే ప్రయత్నాల్లో కొన్ని. "సాధారణంగా నిత్య జీవితానికి పాత్ర ఎంత దగ్గరగా ఉంటే అంతం నమ్మకం కలుగుతుంది. మార్పు లేకుండా ఉండటం కథలోని పాత్రలకు ఉండవలసిన మొదటి లక్షణం (కథాశిల్పం - 2000 :28). ఈ కథలో ప్రశాంత్ రెడ్డి - వీణ పాత్రలు నిత్య జీవితానికి దగ్గరలో ఉన్నాయి. సంఘర్షణ కూడా దగ్గరగానే ఉంది.

ఈ కథలో ప్రశాంత్ రెడ్డికి భయపడో, సర్ది చెప్పటం వల్లనో తన భార్య "వీణ" మనస్తత్వం మారిపోతే కథలో సంఘర్షణ బయటకు రాదు. అప్పుడు కథ పేలవం అయిపోతుంది. "వీణ" మారలేదు. చివరకు ఒకే సైద్ధాంతిక దృక్పథానికి కట్టుబడి ఉండటం వల్లనే, కథలో రచయిత చెప్పదలచిన "సమస్య" పట్ల, పరిష్కారం పట్ల పాఠకుడు లోతుగా ఆలోచిస్తాడు. ఇదే కథకు ప్రాణం వంటిది. కథలో సాధరణంగా ఒక నేపథ్యం చిత్రితమవుతుంది. స్థలం (Place ), కాలాల (Time) చిత్రణే కథాసాహిత్యంలో నేపథ్య (Setting) చిత్రణ ( కథాశిల్పం - 2000 : 34) అవుతుంది. దీన్ని బట్టే రచయిత చిత్రించవలసిన "సమస్య" తీవ్రత అర్థమవుతుంది.

1.3. కథా నేపథ్య చిత్రణ - సమస్య తీవ్రత :

ఒకరోజులో ఈ కథ జరిగినట్లుగా రచయిత వర్ణించారు. కులనిర్మూలన, అస్పృశ్యతా నిర్మూలన ఒక్కరోజులో జరిగేవి కాదు. పొద్దున్నే ప్రశాంత్ రెడ్డి స్నానం చేయడానికి వెళ్తుండగా ప్రారంభమైన కథ రాత్రికి ముగిసింది. కథలో పగలు అంతా ఉన్నది తానూ, తన భార్య. చీకటిలో వచ్చి, చీకటిలోనే ఒంటరిగా కలిసిపోయినవాడు రాహుల్.

తాను అనుభవిస్తున్న వెలుగుని, తన తోటివారికి పంచాలనో, ఆదుకోవాలనో ఆశించటంవల్లనే "రాహుల్"తో కాసేపయినా చీకటిలో ప్రశాంత్ రెడ్డి నిలబడ్డాడు. వెలుతురు కోసం చీకటిలో కలిసిన వాడికోసం చూస్తూ నిలబడ్డాడు. ఈ కథలో వెలుతురు ఉండగా కనిపించిన పాత్రలు మూడు. చీకటిలో వచ్చి చీకటిలోనే వెళ్ళిపోయిన పాత్ర ఒకటి. మూడింటిలో ఒక వర్గం, ఒంటరివాడి తోడు కావాలంటే, తాను తన వ్యవస్థ నుండి బయటకు వచ్చేయాలి. అప్పుడూ రెండు వేరు వేరు సమాజలవుతాయి తప్ప మూడు + ఒకటి = నాలుగు (3+1=4) పాత్రలూ కలిసిన సమాజం కాదు. రాహుల్లో ఆశావాదంగా "అక్క చేతివంట తప్పకుండా మరోసారి తింటానని" అనుకుంటూనే, తాత్కాలికంగా అవమానం వెంటాడినా దాన్ని జయించి, అందరిలో కలిసే రోజు వస్తుందనే ఆకాంక్ష కనిపిస్తుంది. దానికి ఏమీ చేయాలని ప్రశాంత్ రెడ్డి ఆలోచించటమే ప్రశాంత్ రెడ్డి మనసులో రాహు రాసిన వ్యాసంలో వాక్యాల్ని గుర్తు చేసుకుంటూ నిలబడటం. కనుక నాలుగు వర్ణాల వాళ్ళు కలిసి మెలిసి బతకడం ఎలాగో పాత్రానుగుణంగా, సంఘర్షణాత్మక సన్నివేశాలతో ఈ కథ నిర్మిత మయిందని స్పష్టమవుతుంది.

1.4. సమస్య తీవ్రతకు కారణం - అస్పృశ్యత :

భారతదేశంలో కులం అస్పృశ్యతలో అంతర్భాగమయిపోయింది. అస్పృశ్యత అనేది భౌతిక, మానసికమైన మైల (Impurity) వల్ల ప్రపంచ దేశాల్లో ఉందని "అస్పృశ్యులెవరు?" అనే గ్రంథంలో డా. బి.ఆర్. అంబేడ్కర్ పరిశోధనాత్మకంగా చర్చించారు . "అశుచి, మైల, కళంకం, అపవిత్ర, అంటు, అపరిశుభ్రత, మురికి అనే భావాలు అస్పృశ్యతకు దారి తీస్తాయనీ, ఈ కళంకం నుండి తప్పించుకుని బయట పడే మార్గాలు కూడా ఈ భావనలో ఇమిడి ఉంటుందని" డా. బి.ఆర్. అంబేడ్కర్ భావించారు "ఆదిమ సమాజం కేవలం మైల (Pullution) పడడం అనే భావన పట్ల నమ్మకం కలిగి ఉండటమే కాదు, నిర్దిష్టమైన కర్మకాండలు, ఆచార వ్యవహారాలు అనుసరించే ఒక జీవన విధానం ఆవిర్భావానికి కూడా ఈ అస్పృశ్యత అనే భావన దారి తీసింది. "వస్తువుల్ని తాకడం ద్వారా ద్వారా సంక్రమించే "మైల" విషయానికొస్తే, ఆదిమ మానవుడు కొన్ని వస్తువుల్ని పవిత్రమైనవిగా, మరికొన్ని అపవిత్రమైనవిగా పరిగణించటం అలవర్చుకున్నాడు. పవిత్రత అనే భావన కేవలం వస్తువులకు మాత్రమే తప్పనిసరిగా పరిమితం కానక్కరలేదు. కొన్ని తరగతుల మనుషులు కూడా పవిత్రులుగా పవిత్రులుగా పరిగణించబడ్డారు.

పొలినేషియన్ తెగల్లో, 'ఉగాండా' దేవాలయంలో, దక్షిణాఫ్రికాలో, న్యూజిలాండ్లో, ఈజిప్టు గ్రీకు రోమన్లలో కూడా మైలపడటం అనే భావన ఉన్నట్లు అంబేడ్కర్ వివరించారు. ఈ మైల భౌతికమైనదిగానూ, భావనాత్మకం (నమ్మకం) గానూ ఉంటుందని మనువు చెప్పిన అంశాన్నీ అంబేడ్కర్ పేర్కొన్నారు . అయితే మైల నుండి కొంతమంది మాత్రమే సంస్కారాల రూపంలో తొలగించుకోవచ్చు అనే నిబంధనలను భారతదేశంలో పటిష్టంగా అమలు చేశారు. మరికొంత మందికి మాత్రం సంస్కారాల రూపంలో కూడా అపవిత్రతను తొలగించుకునే అవకాశమే లేకుండా చేశారు.

హిందువులు పాటించే మరొక రకమైన అస్పృశ్యత ఉన్నది. ఇది కొన్ని జాతులకు వంశపారంపర్యంగా సంక్రమిస్తున్నది. ఇది కొన్ని జాతులకు వంశ పారంపర్యంగా సంక్రమిస్తుంది. 1935 భారత ప్రభుత్వ చట్టం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లోనే 9 భాగాలుగా విభజించి, మైల పడే కులాల వాళ్ళుగా 50 నుండి 60 మిలియన్ల ప్రజలు ఉన్నారనీ, సుమారు 429 అస్పృశ్య కులాలు ప్రభావితమవుతున్నాయనీ అంబేడ్కర్ సోదాహరణంగా నిరూపించారు.
వివరణలన్నీ అస్పృశ్యత అనేక దేశాల్లో ఉన్నా, భారత దేశంలో అస్పృశ్యత కులంతో మిళితమైందనీ స్పష్టమవుతుంది. అంతే కాకుండా భౌతిక, మానసిక భావనగా ఇది గాఢమైన ముద్రను వేస్తుంది. కనుకనే, "వెంటాడే అవమానం" కథలో ఊరికి తల్లిని త్వరగా పంపేయటం, తల్లి ఉంటే ఊరిలోనూ తెలిసిపోతుందనీ ప్రశాంత్ రెడ్డి భయపడటం, తన భార్యలో ఆ భావాలు స్పష్టంగా ప్రకటితం కావడం అనే నేపథ్య చిత్రణ కథలో సమస్య తీవ్రతను బాగా చూపగలిగింది. ప్రశాంత్ రెడ్డి స్నానానికి వెళ్ళటం, దళితుల్లో కలిసి పోవాలనుకోవటం, దళితులను తమతో కలిసిపోవమనటానికో, సంస్కరణగానో తరతరాల అస్పృశ్యతను సంస్కరించే ప్రయత్నాన్ని చేశారు రచయిత. అలాగే ప్రశాంత్ రెడ్డి భార్య అంట్లు తోమడం, కడగటంలో కూడా ఆమెలో భౌతికంగా,

మానసికంగా రావలిసిన మార్పుని ప్రతీకాత్మకంగా పాత్ర వర్ణన, సన్నివేశ కల్పనలలో సృజనీకరించారు. కథలోని సమస్య సంఘర్షణకు పరిష్కారాన్ని తప్పకుండా చూపించాలనిగానీ లేదా చూపించకూడదని గానీ వాదించటం మొరటువాదంగా విమర్శకులు భావిస్తున్నారు. పరిష్కారం అనేది కథలోనించే సహజంగా రూపొందాలి. పరిష్కారాన్ని బలవంతంగా కథ మీద రుద్దటం శిల్ప పరంగా బాధ్యతా రాహిత్యం మాత్రమే అని కథా విమర్శకులు చెప్పారు. అయితే, కథలో ముగింపు విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయాన్నే కథాశిల్పం రాసిన విమర్శకుడు వివరిస్తూ " కథ రాయటం పూర్తి చేశాక ప్రారంభాన్నీ, ముగింపునీ తీసేయాలని అంటే వాటిని అదృశ్యంగా ఉంచాలని వాటిని పాఠకుని ఊహా శక్తికి పదును పెట్టాలని" అన్నారు. దీనికి వెంటాడిన అవమానం కథ సరిగ్గా అతుకుతుంది.

1.5. కథకుడిచ్చిన పరిష్కారం:

"వెంటాడిన అవమానం" కథలో పరిష్కారాన్ని ఎక్కడా వాచ్యంగా చెప్పలేదు. అయితే దాన్ని suggestive గా పరిష్కారాన్ని స్ఫురింపజేసి మంచి నైపుణ్యంతో ముగించారు. పాఠకుని ఊహా శక్తిని బట్టే పరిష్కారాలు వెలువడాలని ఆకాంక్షించారు. అస్పృశ్యతగా పరిణమించి వ్యక్తుల మధ్య భౌతిక, మానసిక అంతరాలకు కారణమవుతున్న ఈ సమస్యను పరిష్కరించుకోవటం దళిత - దళితేతరుల మధ్యే ఉంది. అది ప్రత్యామ్నాయ సంస్కృతి వలన సాధ్యమా? సాంస్కృతికీకరణా వలన సాధ్యమా? లేక ఆ రెండింటినీ మించిన ఉదాత్త జీవన విధానమా? అనేది "అందరూ కలిసి మెలిసి ఉండే ఆలోచనగా" దళిత - దళితేతర మేధావులు చేయగలగాలి. అది భావ, భౌతిక వాదుల కలయికతో ఏర్పడేదై ఉండాలి. అస్పృశ్యత అనే భావన తొలగిపోయిన తర్వాత భావ భౌతిక వాదాల సంఘర్షణలో ఏదో ఒకటి లేదా ఒక కొత్త శక్తి పుట్టుకొచ్చి మానవులందరినీ కలిసి మెలిసేటట్లు చేయగలుగుతుంది.

1.6. ముగింపు :

"వెంటాడిన అవమానం" కథలో రచయిత కాసుల ప్రతాప రెడ్డి తరతరాలుగా ఉన్న అనేక రకాలైన అస్పృశ్యతలకు సంబంధించిన భౌతిక, మానసిక భావనలను స్పృశించారు. అలాంటి అస్పృశ్యత కొన్ని వందల సంవత్సరాలుగా కులంలో కలిసిపోయింది. అంబేడ్కర్ కూడా భౌతిక, భావవాదాల కలయికగా అస్పృశ్య భావనను చూడగలిగి, భౌతిక దృష్టి వైపు పయనించమనే ఆలోచనను అందించారు. భావవాదం, అదీ భారదేశంలో మతం, కర్మకాండలు, విశ్వాసాలతో ముడి పడి ఉండటం వల్ల ఆ వాదాన్ని నమ్మే, ఆచరించే, ప్రోత్సహించేవాళ్ళ సంఖ్య అధికంగానే ఉంటుంది. అందువల్లనే భావవాదం మాసిపోవడమో, నశించడమో, రూపుమాపటమో సులభమైన మార్గమైతే అంత దగ్గరలో లేదు. శాస్త్ర సాంకేతిక రంగాలు బాగా అభివృద్ధి చెందాలి. శాస్త్రీయ దృక్పథం అలవడాలి. సాంఘికీకరణ ప్రక్రియలు శాస్త్రీయ కోణంలో అమలు జరగాలి. అంతే కాదు, నేటికీ సమాజంలో శాస్త్రీయంగా ఋజువుకానివి ఎన్నో ఉన్నాయి. శాస్త్రానికి అందని వాటిని శాస్త్రీయంగా

నిరూపించటానికి కేవలం ఇప్పుడున్న పరిశోధనల మీదనే ఆధారపడితే సరిపోదు. కానీ, శాస్త్రీయ దృక్పథం ఏర్పడాలని మాత్రం "పెంటాడిన అవమానం" కథ ప్రబోధిస్తుంది. దళిత వాస్తవిక జీవితాన్ని విశదీకరిస్తుంది.

ఆధారాలు:


1. సమాజ శాస్త్ర సూత్రాలు, (సం.పా) ఆచార్య వై.సి. సింహాద్రి., ఆచార్య జి. సత్యనారాయణ., డా. బి.ఆర్. సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రచురణ: హైదరాబాదు - 2003

2. కాసుల ప్రతాపరెడ్డి., పెంటాడే అవమానం (కథ), ఈనాటి ఏకలవ్య (దళిత సాహిత్య, సాంస్కృతిక ప్రత్యేక సంచిక), సంపాదకుడు : కె.జి. సత్యమూర్తి., జనవరి - ఫిబ్రవరి, 1997.

3. వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కథాశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాదు - 2000.

4. డా. ఎస్.వి. సత్యనారాయణ, దళిత సాహిత్య నేపథ్యం (వ్యాసం), ఈనాటి ఏకలవ్య (దళిత సాహిత్య, సాంస్కృతిక ప్రత్యేక సంచిక), సంపాదకుడు : కె.జి. సత్యమూర్తి., జనవరి - ఫిబ్రవరి, 1997.

5. కత్తి పద్మారావు, కులం ప్రత్యామ్నాయ సంస్కృతి, లోకాయత ప్రచురణ : పొన్నూరు, 1994.

6. డా. బి.ఆర్. అంబేడ్కర్, అస్పృశ్యులెవరు?, అనువాదం, సంపాదకులు : ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, ఆచార్య ముదిగొండ వీరభద్ర శాస్త్రి, ఆచార్య బి. రామకృష్ణారెడ్డి., బాబా సాహెబ్ అంబేడ్కర్ రచనలు - ప్రసంగాలు., సంపుటి - 7., ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణలు : 1992.

## సాహసం, దేశభక్తికి ప్రతీక



1931 మార్చి23 వ తేదిన లాహోర్ సెంట్రల్ జైలులో ఉరితీయబడ్డ భగత్ సింగ్ శతజయంతిని ఈ సంవత్సరం జరుపుకుంటున్నాం. ఈ నేపధ్యంలో భగత్ సింగ్ రాజకీయ భావజాలాన్నీ, ఆచరణనూ విశ్లేషిస్తూ ఆయన మిలింటెంటు జాతీయవాద పంథాను అనుసరించడానికి గల కారణాలను చరిత్రకారుడు వి. ఎన్. దత్తా అన్వేషిస్తాడు.

ఇరవైయవ శతాబ్దపు ఆరంభంలో భారతదేశ స్వాతంత్రం కోసం రెండు పంథాలు అనుసరించారు. ఒకటి రాజ్యాంగబద్ధమైనది. బి. జి. గోఖలే వర్గం భారతదేశానికి 'స్వయం పరిపాలన' సాధించాలనే లక్ష్యంతో పనిచేసారు. రెండవది బ్రిటిషు ప్రభుత్వాన్ని స్తంభించాలనే ఉద్దేశంతో మహాత్మాగాంధీ ముందుకు తెచ్చిన 'సహాయనిరాకరణాద్యోమం'. ఈ రెండు పంథాలు భగత్ సింగ్ ను ఆకట్టుకోలేక పోయాయి.

భగత్ సింగ్ రాజకీయభావజాలం పైన కానీ, 1931 మార్చి 23 వతేదిన లో ఆయనను ఉరితీయడానికి దారితీసిన అప్పటి పరిస్థితులపైన కానీ పెద్దగా పరిశోధన జరగలేదు. అంటే పరిశోధనకి కావలసిన వనరులు, సామాగ్రి లేక కాదు. చాలామంది చరిత్రకారులు భగత్ సింగ్ ఎంచుకున్న మార్గానికి దారితీసిన అప్పటి సామాజిక పరిస్థితులనూ, సంఘర్షణలనూ అర్ధంచేసుకోకుండా కొన్ని బాహ్య విషయాలపైనా సంచలనాత్మకమైన సంఘటనలపైనా దృష్టిపెట్టారు.

పంజాబ్ రాజకీయంగా ఉద్రిక్తంగా వున్నకాలంలో, 1907 సంవత్సరంలో భగత్ సింగ్ జన్మించాడు. అప్పటి గవర్నర్ డెంజిల్ ఇబెట్సన్ "పంజాబ్ లో కొత్త గాలి వీస్తుంది" అని రాసాడు. రైతులలో అలజడి రేపుతున్నారనే నెపంతో భగత్ సింగ్ బాబాయి అజిత్ సింగ్నూ, లాలాలజపతి రాయ్నూ మాండలే కు బహిష్కరించారు. బ్రిటిషు ప్రభుత్వం 1818 నల్లచట్టాలను ప్రయోగించింది. అజిత్ సింగ్, లాలాలజపతిరాయ్ పంజాబ్ లో రైతుల భూస్వామ్యుల మద్దత్తును కూడగడుతూ, వలసవాద నల్లచట్టాలను రద్దుచేయాలని ఉద్యమం లేవదీసారు.

బ్రిటిషువాళ్ళు తిరుగుబాటు భావాలకు కేంద్రంగా భావించే లాహోరు లోని డి.ఏ.వి హైస్కూల్ లో భగత్ సింగ్ చేరాడు. చిన్నప్పడే భగత్ సింగ్ మానసికంగా బాగా పరిణితి చెందాడు, కానీ చదువులో అంత గొప్ప ఏమీకాదు.

పుస్తకాలు బాగా చదివాడు. కానీ స్థిరత్వం వుండేదికాదు. కీర్తి పత్రికలో ప్రచురించిన రచనలప్రకారం మదనలాల్ ఢింగ్రీ విప్లవపోరాటాలూ, భాయ్ పరమానంద్ దేశభక్తి భావాలూ, మరియు ఉరితీయబడ్డ భాయ్ ముకుంద్ల ప్రభావం భగత్ సింగ్ మీద బాగా వుండేవి. నిబద్ధతతో, పోరాటస్ఫూర్తితో గదర్ పార్టీ నాయకులు పంజాబ్ ను విప్లవపోరాటలకు భూమిక చేసారని భగత్ సింగ్ చెప్పేవాడు. ఆరోజులలో పంజాబ్ లోని ఉద్యమానికి కర్తార్ సింగ్ సరభా ముఖ్యనాయకుడు, విప్లవోద్యమానికి నాయకులైన రాస్ బిహారీబోస్ మరియు ఎస్. జి. పింగ్లే నాయకత్వంలో పనిచేసేవాడు.

పదకొండు సంవత్సరాల వయస్సులోనే భగత్ సింగ్ ఏప్రిల్ 13, 1919 న జరిగిన జలియన్ వాలాబాగ్ హత్యాకాండనూ, 'మార్షల్ లా' నల్లచట్టాల దురాగతాలనూ చూసాడు. పంజాబ్ లో జరిగిన ''తప్పులు'' మరియు ఖిలాఫత్ అంశాన్ని సమ్మేళించి, గాంధీ సహాయనిరాకరణోద్యమాన్ని ప్రారంభించి దేశాన్ని చైతన్యపరిచాడు. భగత్ సింగ్ రాజకీయాలు అతని జీవితారంభంలో తెలుసుకోవడం కష్టమే, కానీ 1920 నుండి చాలా స్పష్టంగా అర్థమవుతాయి. సహాయనిరాకరణోద్యమం కాలంలో భగత్ సింగ్ బ్రిటిషుపాలనను నిరసిస్తూ లాలాలజపతి రాయ్ ప్రారంభించిన ''నేషనల్ కాలేజీ'' లో చేరాడు. గురు కా బాగ్ లో అకాలీలు జరిపిన ఊరేగింపులో కూడా పాల్గొన్నాడు.

1922 ఫిబ్రవరి 5 తేదిన చౌరీచౌరా సంఘటనలో కొంతమంది పోలీసులు మరణించటంతో గాంధీ సహానిరాకరణోద్యమాన్ని ఆపేశాడు. 1922 - 24 కాలంలో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా పంజాబ్ లో చెలరేగిన మతకల్లోలాల వల్ల హిందూ - ముస్లిం సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. దేశం రాజకీయంగా చాలా బలహీనంగావున్న కాలమది. రాజ్యాంగపరమైన విభేదాలతో కాంగ్రెసు, ముస్లింలీగ్ , పంజాబ్ యూనియన్ పార్టీల మధ్య చీలికలు వచ్చాయి. గాంధీ మొదలుపెట్టిన సహానిరాకరణోద్యమం కుప్పకూలిపోవటం, దేశంలో మతకల్లోలాలు చెలరేగటం భగత్ సింగ్ కళ్ళారా చూసాడు. రాజ్యాంగపరమైన విభేదాలతో, కుమ్ములాటలతో వైఫల్యం చెందుతున్న రాజకీయపార్టీలను చూసాడు. స్వాతంత్రం కోసం రాజకీయపార్టీలు అవలంబిస్తున్న మార్గాలతో, వాటి వైఫల్యాలతో విసిగిపోయాడు.

మార్క్సిజం ప్రేరణతో విప్లవపోరాటంతోనే భారతదేశంలో బ్రిటిషు దురాక్రమణను అంతం చేయవచ్చని భగత్ సింగ్ భావించాడు. 1923 లో ''హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ '' లో చేరాడు. విద్యార్థులలో విప్లవభావాలు వ్యాప్తిచేయడానికి 1926 మార్చి లో లాహోర్ లో ''నౌజవాన్ భారత్ సభ''ను స్థాపించాడు. పంజాబ్ బెంగాల్ లలో విప్లవపార్టీ నిర్మాణం చేస్తూ సోషలిజానికి చేరువయ్యాడు. భగత్ సింగ్ రాజకీయ కార్యాచరణకు సోషలిస్టు భావజాలం సైద్ధాంతిక పునాదివేసింది.

''బ్లాక్ ఫ్లాగ్ మార్చ్'' నిరసన ప్రదర్శనలో లాలాలజపతి రాయ్ పై లాటీచార్జీ చేసిన స్కాట్ అనే పోలీసు అధికారిని భగత్ సింగ్ అంతమొందిద్దామనుకున్నాడు. భగత్, సుఖదేవ్, చంద్రశేఖర్ అజాద్లు పొరపాటున

స్కాట్కి బదులుగా సాండర్స్ అనే పోలీసు హెడ్ కానిస్టేబుల్ ను అంతం చేసారు. 1929 ఏప్రిల్ 8 వ తేదీన భగత్ సింగ్ , బి.కే దత్ కలిసి సెంట్రల్ లేజిస్లేటివ్ అసెంబ్లీ లో బాంబులువేసి బ్రిటిషు దురాక్రమణదారుల కపటనాటకాలనూ 'స్వయంపరిపాలన' ఇస్తామనే బూటకపు వాగ్దానాలనూ బట్టబయలుచేసారు. ''ఇంక్విలాబ్ జిందాబాద్'' అని నినాదాలిస్తూ స్వయంగా అరెస్టు అయ్యారు. తర్వాత భగత్ సింగ్ , రాజగురు, సుఖదేవ్ లను బ్రిటిషు దురాక్రమణదారులు లాహోర్ జైలులో 1931 మార్చి 23 వతేదిన ఉరితీసారు.



భగత్ సింగ్ గాంధీ మార్గాన్ని తిరస్కరించాడు. మరి భగత్ సింగ్ పైన, ఆయన చర్యలపైన గాంధీ, కాంగ్రెసు నాయకుల అలోచనలు ఎలావున్నాయి? అప్పటి కాంగ్రెసు అధ్యక్షుడు జవహర్ లాల్ నెహ్రూ లాహోరులోని సెంట్రల్, బోరస్టాల్ జైళ్ళను 1929 లో సందర్శించి భగత్ సింగ్ నూ అతని అనుచరులను కలిసారు. వారి దేశభక్తికీ, నిబద్ధతకూ ముగ్ధుడై వారిని ''జాతీయ వీరులు'' అని నెహ్రూ పేర్కొన్నాడు. భగత్ సింగ్ మేధస్సును చూసి అబ్బురపడ్డాడు. నెహ్రూ తన ఆత్మకథలో వారి సాహసానికీ దేశభక్తికీ శ్రద్ధాంజలి ఘటించాడు. కానీ కాంగ్రెసు పార్టీ భగత్ సింగ్ పైన విధాన నిర్ణయం తీసుకొనే సమయంలో మటుకు నెహ్రూ మాటమార్చి తప్పిదం చేసాడు. 1931 లో జరిగిన కరాచీ కాంగ్రెసు సభలో నెహ్రూ మాట్లాడుతూ ''భగత్ సింగ్ మార్గంలో వెళ్ళవద్దు, ఎందుకంటే అది దేశాన్ని నాశనం చేస్తుంది'' అన్నాడు. ఆయన భగత్ సింగ్ చర్యలను ఆమోదించలేదు....

కొంతమంది విమర్శకులు గాంధీ తలుచుకొనివుంటే భగత్ సింగ్ ప్రాణాన్ని కాపాడగలిగేవాడు, కానీ ఆయన ప్రయత్నించ లేదంటారు. ఆయన 'గాంధీ - ఇర్విన్' ఒప్పందంలో భగత్ సింగ్ ను కాపాడలనే ప్రతిపాదన పెట్టలేదు. వైస్రాయి ఇర్విన్ తో జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలలో మటుకు భగత్ సింగ్ ఉరిశిక్షను రద్దుచేయాలనీ, ఉరిశిక్ష దుర్మార్గమనీ పేర్కొన్నాడు. గాంధీ, ఇర్విన్ల మధ్య ఏదో రహస్య అవగాహన వున్నదనీ దానిప్రకారం ఒప్పందాన్ని ఆమోదిస్తూ కాంగ్రెసు తీర్మానం చేసిన తర్వాత ఉరిశిక్షను రద్దుచేస్తారనీ ఊహాగానాలుండేవి. దీనికి ఆధారాలు లేవు. లార్డు హాలీఫాక్స్ గా పేరు మార్చుకున్న ఇర్విన్ ఆత్మకథలో ఎక్కడా 'రహస్య అవగాహన' ప్రస్తావనే లేదు. దానితో ఊహాగానాలకు తెరబడుతోంది.

మనసు, లేక బుద్ధి అనేదీ, మెదడూ ఒకటి కాదా? ఇది శాస్త్రవేత్తలనూ, తత్వవేత్తలనూ, సామాన్యులనూ కూడా వేధించే సమస్య. పదిహేడో శతాబ్దంలో రేనే దేకార్త్ అనే ఫ్రెంచ్ తత్వవేత్త దీన్ని గురించిన చర్చ లేవనెత్తాడు. ఈ విషయంలో బౌద్ధమతంలో ఉన్న ఒక అభిప్రాయం ఏమిటంటే మన పంచేంద్రియాలూ, నాడీమండలమూ, మెదడూ వగైరాలన్నీ జీవపరిణామక్రమంలో మనకు యదార్థతను సరిగ్గా వివరించగలిగే స్థాయికి ఎదిగి ఉండకపోవచ్చు.

అవన్నీ కేవలం మన మనుగడ కొనసాగడానికే తోడ్పడుతూ ఉండవచ్చు. ఇంకా ఆధునిక పరిభాషలో చెప్పాలంటే అది మన జన్యువుల మనుగడ కోసమే జరిగిన ఏర్పాటు కావచ్చు. ప్రాణులకు ఆత్మ పరిరక్షణ కోసమని ''అహం'' (ఈగో) అవసరమౌతుంది. ఎందుకంటే తనకూ, ఇతర ప్రాణులకూ ఉన్న తేడాను గుర్తించలేని ప్రాణి బతకలేదు. మనకు హాని కలిగే పరిస్థితి ఎదురైనప్పుడు ఇది బాగా ద్యోతకం అవుతుంది. సామాన్యంగా ఇంద్రియాల నుంచి లభించే ప్రేరణలు అవగాహన, లేదా చైతన్యం రూపంలో మనకు ఉపయోగపడే అనుభవాలుగా రూపుదిద్దుకుంటాయి.

ఎటొచ్చీ మన అవగాహనకు పరిమితులుంటాయనేది నిరూపించడం కష్టంకాదు. ఉదాహరణకు సెకండుకు 24 నిశ్చలనమైన బొమ్మలు సినిమా రీలుగా తిరుగుతున్నప్పుడు మన కళ్ళు విడి ఫ్రేములను గుర్తించకుండా నిజంగా జరుగుతున్న దృశ్యంలాగా వీక్షిస్తాయి. ఏ లోయలోకో, విమానం నుంచో తొంగి చూస్తున్నప్పుడు మన కంటికి కనబడే రెండు కొలతల దృశ్యానికి అతీతంగా మనకు ''లోతు'' గురించిన అవగాహన తీవ్రంగా కలుగుతుంది. అలాగే సంగీతం వింటున్నప్పుడు అనేక వాయిద్యాలు వివిధ స్వరాలను పలికిస్తున్నా మొత్తం ఆర్కెస్ట్రా వాయిస్తున్న''ట్యూన్'' మనకు తేలికగా పట్టుబడుతుంది. దీనర్థం ఏమిటంటే ఇంద్రియాలనుంచి మనకు నేరుగా అందుతున్న ప్రేరణలను ''అర్థం చేసుకోవడానికి'' మన అనుభవం చాలా పని చేస్తూ ఉంటుంది. కుక్కలకు వాసనపట్టే శక్తి ఎంత ఎక్కువగా ఉంటుందంటే మనకు కనబడే దృశ్యాలతో పోలిస్తే వాటి ''ఘ్రాణ''చిత్రాలు వాటికి చాలా వివరంగా అర్థం అవుతాయట.

అనుభవాలన్నిటికీ మూలాధారం ''నేను'' అనే భావన. అవతలివారు ఎంతటి ఆత్మీయులైనా వారిని గిల్లితే మనకు బాధ కలగదు. నేను, నాది అనే అహంభావన మనకు పుట్టుకతో రాకపోయినా క్రమంగా ఏర్పడుతుంది. కాని ఈ అహంభావన ఎంత యదార్థమైనదో చెప్పడం కష్టం. మనం ఎదుగుతున్న కొద్దీ అది మారుతూ ఉంటుంది. ఉదాహరణకు ఒకే మనిషికి బాల్యంలోనూ, నడివయసులోనూ, ముసలితనంలోనూ ''నేను'' అనే భావన ఒకేలా ఉంటుందా? లేక ఎప్పటికప్పుడు కొత్తగా తయారౌతూ ఉంటుందా? ఎందుకంటే చిన్నప్పుడు ''నేను'' అనబడే వ్యక్తికి రకరకాల విషయాలూ, వివరాలూ గుర్తుంటాయి. అనేక సంఘటనల గురించి అనేక

అభిప్రాయాలు ఏర్పడతాయి. అదే వ్యక్తి పెరిగి, పెద్దవుతున్నకొద్దీ ''నేను'' అనే భావన మారదుగాని ఎన్నో పాత విషయాలు మరచిపోవడం, వాటి ప్రాధాన్యత తగ్గడం, వాటి స్థానే మరేవో రావడం జరుగుతుంది. మరి ఎప్పటికప్పుడు మారిపోయే పరిస్థితుల్లో శాశ్వతమైన ''నేను'' అనేది ఉండడం నిజం కాకపోవచ్చు. మెదడు ''సజావుగా'' పనిచెయ్యడానికి కారణం ఏమిటంటే ప్రాణి బతికున్నంత కాలమూ దానికి ఎదురయే రకరకాల అనుభూతులను అవగాహన చేసుకుంటూ, శాశ్వతమైన ''అహంభావనను'' కలిగిస్తూ ఉంచడమే. ఎందుకంటే దాని మనుగడకు అది చాలా అవసరం.

మన వేదాంతులు తాడును చూసి పామనుకునే రజ్జు సర్ప భ్రాంతి గురించి చెపుతూ ఉంటారు. వీటిలో ఏది భ్రమ, ఏది నిజం? భౌతికవాదులకు యదార్ధత అంటే మెదడు ''సహజ''స్థితిలో ఉన్నప్పుడు మనకు తెలిసే విషయాలు. అదే మెదడు మనిషి ధ్యానంలోనో, మగతగానో ఉన్నప్పుడు ఇతర రకాల భావనలకూ, ప్రేరణలకూ లోనవుతుంది కనక అప్పుడు అనిపించేవన్నీ అవాస్తవాలుగా పరిగణించాలి. దేవుడూ, ఇతర ఆధ్యాత్మిక విషయాల గురించిన భావాలను ''అపస్మారక'' స్థితిలో ఉన్న మెదడులో కృత్రిమంగా సృష్టించవచ్చని శాస్త్రపరిశోధనల్లో తేలింది కనక వాటిని భ్రమల కింద జమకట్టాలి. పదే పదే అలా జరుగుతూ ఉంటే దాన్ని మానసిక రుగ్మతగా భావించాలి. బౌద్ధులు ఈ ప్రతిపాదనను తలకిందులు చేసి, ''అహం'' అనేదే మిథ్య అనీ, దేహాన్ని పరిరక్షించే ప్రయత్నంలో శరీరధర్మాలు ఎప్పటికప్పుడు మనకు ఆ భావనను కలిగిస్తూ ఉంటాయనీ, మారకుండా నిలిచే ఆత్మచైతన్యం ఉండదనీ అంటారు.

కొన్ని రకాల మాదకద్రవ్యాలు సేవించినవారికి ''ఆధ్యాత్మిక'' భావనలు కలిగినట్టు పరిశోధనల్లో గుర్తించారు. అలాగే లోగడ తమకు భావోద్వేగాన్ని కలిగించిన కొన్ని సంఘటనలను గుర్తుచేసుకుంటున్నవారి మెదడులో దాదాపు అంతటి తీవ్రమైన మార్పులు మళ్ళీ కలుగుతాయని తెలిసింది. కణతల కింద ఉండే మెదడు భాగానికీ, తల మీద ఉండే మెదడు భాగానికీ లంకె చెడిపోయిన రోగులకు తమ శరీర భంగిమకూ, పరిసరాలకూ సంబంధం గుర్తించడం కష్టమైంది. బతికుండగానే శరీరం నుంచి ''ఆత్మ'' వేరై, మన శరీరాన్ని మనమే దర్శించగలిగినట్టు కొందరు భావించడానికి ఇదే కారణం కావచ్చునని కొందరు శాస్త్రవేత్తలు అంటున్నారు. అలాగే ఎపిలెప్సీ రోగులకు మతప్రేరణలు కలుగుతాయని అనేక ప్రయోగాల్లో తెలిసింది.

మనసు అనేదానికి మెదడుతో సంబంధం లేదనీ, అది పరిణామదశలకు అతీతమైనదనీ కొందరు అనుకుంటారు. దీనికి రుజువులేవీ కనబడవు. విశ్వాంతరాళాన్నీ, అందులో జరిగిన, జరుగుతున్న సంఘటనలనీ అంతటినీ చూసినప్పుడు తెలివీ, స్పృహా, అవగాహనా మొదలైన చేతనత్వానికి సంబంధించిన గుణాలు ప్రాణులకు మాత్రమే పరిమితమైనవని తెలుస్తోంది. భూమి మీద తప్ప విశ్వంలో జీవరాశి పెరిగిన దాఖలాలేవీ ఇంతవరకూ లభించలేదు కాని తగిన పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎక్కడైనా ప్రాణులు ఉద్భవించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు నమ్ముతారు. అలా జరిగినా కూడా ప్రాణులకి ఉండగలిగిన కొద్దో గొప్పో చైతన్యం వాటి మనుగడకు పనికొచ్చే విధంగానే రూపొందుతుంది. అంతేకాని విశ్వానికి సంబంధించినంత వరకూ

అటువంటి చైతన్యం గాని అవగాహన కాని ఎందుకూ "పనికిరావు". విశ్వమంతా యదార్థమే కావచ్చు గాని అందులో అవగాహన అనేదానికి ఒక స్థానం గాని, అవసరం కాని ఉందనడానికి ఎటువంటి ఆధారాలూ కనబడవు. ఒక్క భూమినే తీసుకున్నా మనిషివంటి ప్రాణులకు గల సంక్లిష్టమైన నాడీ వ్యవస్థా, మెదడూ, వివేచనా, వివేకమూ తక్కిన జీవాలకు ఉండవు. అందువల్ల వాటికి పెద్ద నష్టం కూడా కలగటం లేదు. మనుషుల కన్నా బాక్టీరియా వంటి సూక్ష్మ జీవులు ఎంతో అభివృద్ధి చెంది, హాయిగా బతుకుతున్నాయి. తక్కిన ప్రాణుల్లాగే వాటిలో అవసరమైనంత వరకూ జీవపరిణామం విజయవంతంగానే జరిగింది. మనలాగా అవి ఏది సత్యం ఏదసత్యం అని మథనపడుతున్న సూచనలేవీ లేవు!

## కేన్సర్ వ్యవస్థలో ఛిద్రమైన కవి కుటుంబం - వరవరరావు




( చెరబండరాజు కూతురు ఉదయిని కి నివాళిగా రాసిన వ్యాసం )

'నేను చెప్పలేదా, నాకు ఆడపిల్ల పుట్టింది. ఇంక మీరు నన్ను అరెస్టు చేసుకోవచ్చు' అన్నాడు. 'తల్లీ, పిల్లను దవాఖానానుంచి తీసుకొస్తారు కదా. ఇంటికి వస్తాం లెండి' అన్నారు పోలీసులు. చెరబండరాజును అక్టోబరు 11న మీసా కింద అరెస్టు చేశారు. అంటే ఉదయిని అప్పటికి మూడు రోజులపాప.

1973 అక్టోబర్ 6,7 తేదీల్లో వరంగల్‌లో విరసం 'సాహిత్య పాఠశాల' జరిగింది. విరసం మహాసభలకు బదులుగా 'సాహిత్య పాఠశాల' నిర్వహించే సంప్రదాయం అట్లా ప్రారంభమైంది. శ్రీశ్రీ 'మినీలాంగ్ మార్చ్'గా నిర్వచించిన ఊరేగింపు హనుమకొండ జీవన్‌లాల్ గ్రౌండ్స్‌నుంచి వరంగల్ మహబూబియా హైస్కూల్ గ్రౌండ్స్ (జగదీశ్‌నగర్) వరకు ఎనిమిది కిలోమీటర్లు సాగింది. అక్టోబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురి మీద ఆంతరంగిక భద్రతా చట్టం (మీసా) కింద అరెస్టు వారెంట్లు జారీ చేసింది. హైదరాబాదు సిటీ కమిషనరు చెరబండరాజు, ఎంటి ఖాన్‌లపై, వరం గల్ కలెక్టర్ నాపై అరెస్టు వారెంట్లు జారీచేశారు. ఎంటి ఖాన్‌ను 9వ తేదీ సాయం త్రమే పురానాపూల్‌లోని ఆయన ఇంటిదగ్గర అరెస్టు చేశారు. ఆ సాయంకాలమే అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు దగ్గర్లో ఉంటున్న చెరబండరాజును అరెస్టు చేయడానికి అంబర్‌పేట పోలీసుల పోయా రు. పెట్లబురుజు దగ్గర, పాతబస్తీలో ఉండే పోలీసు కానిస్టేబుళ్ళతో ఎంటి ఖాన్‌ను, అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే పోలీసు కానిస్టేబుళ్లతో చెరబండరాజుకు లంగోటా దోస్తీ. చెరబండరాజయితే ఎప్పుడూ సైకిలుపై ఆ పోలీసుస్టేషన్ ముందునుంచే ఆవరణలో కనిపించే కానిస్టేబుళ్లను పలకరిస్తూనే రోజూ పోతుండేవారు. ఆ పరిచయంతోనే చాలా మర్యాదపూర్వకంగానే పైవాళ్ల ఉత్తర్వులు అమలు చేయించడానికి వాళ్లు పోయా రు. చెరబండరాజు ఒక్కడే ఉన్నాడు. 'శ్యామలను ప్రసవం కోసం ఆసుపత్రిలో చేర్చాను. ఈ రాత్రి పాప పుడుతుంది. రేపు సాయంత్రం వచ్చి అరెస్టు చేయండి' అని నిష్కల్మషమైన చిరునవ్వుతో అడిగాడు చెరబండరాజు. 'సరేసార్, భార్య పురుటి నొప్పులతో దవాఖానాలో ఉంటే అరెస్టు చేసే దుర్మార్గులం కాము. కాని పాప పుడుతుందనే ఎట్లా చెప్తారు సార్'

అన్నారు వాళ్లు. 'మాకు పాపే, ఆడపిల్లే కావాలి. ఆడపిల్లే పుడుతుంది' చెరబండరాజుకు విప్లవ విజయంపై ఎంత ప్రగాఢవిశ్వాసమో తన వ్యక్తిగత ఆకాంక్షల సాఫల్యంపట్ల కూడా అంత తిరుగులేని నమ్మకం.

1944లో నల్లగొండ జిల్లా అంకుశాపురంలో 'ఏటికేతంబెట్టి ఎయిపుట్లు పండించి గంజిలో మెతుకెరుగని' రైతు కుటుంబంలో పుట్టిన బాలనరసింహ, బక్కారెడ్డి, శెరబందిరాజు (ఎలియాస్ చెరబండరాజు)కు మైనర్‌గానే పెళ్లయింది 16, 17 ఏళ్ల వయసులో. శ్యామలకు 14 ఏళ్లు. ఇద్దరూ కాపుబిడ్డలవలె చేన్లలో, చెలకల్లో, పొలాల్లో మట్టిపని, బురదపని చేశారు. అప్పుడామె నుదుటిపై చెమటచుక్కలకు అంటిన కురులపై ఆయన పద్యాలు రాశారు. ఆ తర్వాత సంస్క-ృతాంధ్ర కళాశాలలో తెలుగు ప్రబంధాలు చదువుకున్నప్పుడు పింగళి సూరన సుగాత్రీశాలీనులు చేనులో పనిచేస్తూ వానలో తడిసినప్పటిటి విసర్గ సౌందర్య ప్రేమను ఇష్టపడ్డాడు. కాని దాదాపు పదేళ్ల దాకా కూడా వాళ్లకు సంతానం కలగలేదు. చెరబండరాజుకు పిల్లలన్నా ముఖ్యంగా ఆడపిల్లలంటే ఎంతో మక్కువ. ఈ మక్కువ లేవీ సకాలంలో నెరవేరని సామాజిక పరిస్థితుల్లోకి మొదట, రాజకీయ నిర్బంధంలోకి ఆ తర్వాత ఆయన నెట్టబడ్డాడు.
1970 జులై 4న ఆయన సహచరులతోపాటు విరసం ఏర్పాటు చేసి 71 ఆగస్టు లోనే జ్యోతి, నిఖిల్‌లతోపాటు పీడీయాక్టు కింద అరెస్టయినప్పటినుంచీ, ఆయనే ఎమర్జెన్సీలో జైల్లో రాసుకున్నట్టుగా

నేను పసిపాపల్ని ముద్దాడితే
వారి చెక్కిళ్ల మీద తడిని
కత్తులతో చెరుపుతారు
అనే అమానవీయ వాతావరణం ఏర్పడింది.

చెరబండరాజు దశాబ్దకాలపు ఎదురుచూపు, కలలో పండినట్లుగా అక్టోబరు 9న ఆయనకు పాప పుట్టింది. ఆసుపత్రిలో పాపను చూసుకుని ఆ రాత్రి ఆసుపత్రి వరం డాలోనే పడుకొని, 10వ తేదీ ఉదయం వస్తూనే అంబర్‌పేట పోలీసు స్టేషన్‌లో మిఠాయికూడా ఇస్తూ 'నేను చెప్పలేదా, నాకు ఆడపిల్ల పుట్టింది. ఇంక మీరు నన్ను అరెస్టు చేసుకోవచ్చు' అన్నాడు. 'తల్లీ, పిల్లను దవాఖానానుంచి తీసుకొస్తారు కదా. ఇంటికి వస్తాం లెండి' అన్నారు పోలీసులు. చెరబండరాజును అక్టోబరు 11న మీసా కింద అరెస్టు చేశారు. అంటే ఉదయిని అప్పటికి మూడు రోజులపాప. ఆ పసి పాపతోనే ఆయనను జైల్లో కలవడానికి వారానికోసారి ఇచ్చే ములాఖత్‌కు వెళ్లేది శ్యామల. జైలులోనే కూతురు ఉదయిని కోసం 'పాపా!' అని పాట రాశాడు చెరబండరాజు.

ఆడుకో మా పాప ఆడుకోవమ్మా
మీనాన్న వస్తాడు నీకు ముద్దిస్తాడు అంటూ పోరాట పాఠం చెప్తూ..
ఓరుగల్లు మామనేరమేమిజేసె

భాగ్యనగరపు మామ ఎవరి కొంప ముంచె
బందిఖానాలల్ల బంధించినారమ్మ
ప్రజల బాగు కొరకు పాట గట్టాడమ్మ
ఎరుపు మామయ్యతో గొంతు కలిపాడమ్మ
నిర్దోషి మీ నాన్న ఖైది అయినాడమ్మ

అని ఇంకా మాటలుకూడా నేర్వని పాపకు తనను పరిచయం చేసుకునే ప్రయత్నం చేశాడు. 73 నవంబర్ 16న హైకోర్టు ఉత్తర్వులపై విడుదలయి ఆరు నెలలు తిరగకుండానే సికిందరాబాదు కుట్ర కేసులో చెరబండరాజు 18 మే 74న అరెస్టయ్యాడు. అప్పటికి ఉదయిని ఏడు నెలల పాప. అచ్చం చెరబండరాజు పోలికలతో విశాలనేత్రాలతో మాటలు నేర్చే వయసు 'మా పాప మాట్లాడుతోంది' అని పాట రాశాడు చెరబండరాజు. సికింద్రాబాదు కుట్ర కేసులో 75 జనవరిలో విడుదలయ్యాడో లేదో ఆరు నెలలు తిరగకుండానే జూన్ 26న ఆత్యయిక పరిస్థితి ప్రకటించగానే మళ్లీ అరెస్టయ్యాడు. పాప మొదటి పుట్టిన రోజుకు 'చందమామ' వంటి పాట రాశాడు.

మా యింటి అందాల చందమామా
చీకట్లు చిరకాలముండవమ్మా
జాలిగుండె ల తల్లి చెంతనున్నాది
చెరసాలలో తండ్రి క్షేమమన్నాది
.... అమ్మ కంటికి నీవు చందమామా
వెన్నెలూరే పెరుగుకుండవమ్మా
నీ చేతిచలువలో వెన్నెలున్నాది
నీ నవ్వులో పూల జల్లూ వున్నాది
మా కలల మొలకవే చందమామా
కన్నీరు మాకేల చెప్పవమ్మా
నీ కళ్ళ వెలుగు లో శాంతివున్నాది
మా అశాంతులకదీ మందు అయినాది.

ఆ కలల మొలక ఆటపాటలతో ఎదిగే క్రమమంతా చెరబండరాజు జైలు, కాకపోతే ఆయన మాటల్లో 'గాంధీ రోగ నిలయం'లో బ్రెయిన్‌ట్యూమర్ వంటి భయంకర రోగంతో గడిచి ఆరు నెలలపాటు కోమాలోనే ఉండి చివరకు 82 జులై 2న కన్నుమూశాడు. అప్పటికి ఉదయిని వయసు కేవలం తొమ్మిది సంవత్సరాలు. సరిగ్గా ఉదయిని తన 33వ ఏట ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో కన్నుమూసే సమయానికి ఆమె పాప సింధూరది అదే వయసు. అమ్మకంటి చందమామలుగా పాపలు పుడుతున్నారుగానీ 'కన్నీరుమాకేల' అనే పరిస్థితి లేదు. చెరబండరాజు

జైలు, అనారోగ్యంతో ఆసుపత్రి కాలమంతా 71 నుంచీ 82దాకా ఆయన సహచరి శ్యామల చేసిన సేవలు, భరించిన కష్టాలు, అనుభవించిన వేదన మనకు తెలంగాణలో తెలియని ఇంకెందరు మహిళలు అనుభవించారో ఊహించవలసిందే తప్ప చెప్పలేం. ఎమర్జెన్సీ లో విడుదలయి 81లో గవర్నర్ ఉత్తర్వులతో 311 సి కింద ఉద్యోగం కూడా కోల్పో యి ఆటో నడుపుకొని బతకాలని చెరబండరాజు నిర్ణయించుకునే కాలానికి ఒక కొడు కుకూడా పుట్టాడు. ఆ కిరణ్ ఆటపాటలు చూడకుండానే ఆయన కన్ను మూశాడు.

చెరబండరాజు శిక్షణలోనే ఉదయిని 'కొండలు పగిలేసినం బండలను పిండినం' పాటకు భూపాల్ రూపకల్పన చేసిన నాట్యం చేసేది. 1990 జనవరిలో ట్యాంకుబండు, హుసేన్‌సాగర్ పక్కన జరిగిన విరసం ఇరవయ్యేళ్ళ సభల్లో ఉదయిని బహిరంగసభ వేదికపై ఆ నృత్యరూపకం ప్రదర్శించి వేలాదిమంది మనసులు చూరగొన్నది. కాని, చెరబండరాజు మరణానంతరం వచ్చే చాలీచాలని ఉపాధ్యాయ పెన్షన్, తల్లి, తమ్ముడుతో కుటుంబం గడవడం కష్టమై ఉదయిని ఇంటర్మీడియేట్‌తోనే చదువు మానేసి చేతికందిన ఉద్యోగాలు చేయాల్సివచ్చింది. ఆ దుర్భర పరిస్థితుల్లో ఆమెపెళ్ళి గురించి ఆలోచించినపుడు మాత్రం 'నాన్న రాజకీయాలవల్ల అమ్మ పడిన కష్టాలు చూసాను. నేనా టెన్షన్ తట్టుకోలేను' అని మాత్రం చెప్పింది.

హైదరాబాద్ మాసాబ్‌ట్యాంకు పాలిటెక్నిక్‌లో చదివిన నాగార్జునరెడ్డిని ఆమె ప్రేమించిందని వాళ్ళిద్దరూ ఇంట్లో ఎవరికీచెప్పకుండా పెళ్ళిచేసుకొని వచ్చేదాకా ఊహించలేకపోయాం. ఆయన విద్యార్థిగా రాడికల్ ఉద్యమంలో ఉన్నా, 1997నాటికే లారీకొనుక్కొని వ్యాపారంలో ఉన్నాడు. ఉదయిని తన వైవాహిక జీవితాన్ని ఏడాది, ఏడాదిన్నరయినా అనుభవంచిందో లేదో, 98మార్చి నెలలో హైదరాబాదు తార్నాకలో ఆరాధన థియేటర్ ముందు హైదరాబాదు నగరపీపుల్స్‌వార్ కార్యదర్శి సుభాష్ (రవి), మెదక్‌జిల్లా పీపుల్స్‌వార్ జిల్లా కమిటీ సభ్యుడు భానుతో పాటు నాగార్జునరెడ్డి కూడా అరెస్టయి 'ఎన్‌కౌంటర్' అయ్యాడు. అప్పటికి వాళ్ళ పాప సింధూర ఆరునెల లు కూడా నిండని పసికూన. ఈ భావజాలం వల్ల వచ్చే ఘర్షణను కూడా అనుభవిం చలేనని సున్నితంగా భావించిన పాతికేళ్ళు నిండని ఉదయినికి తన వైవాహిక జీవితం లో సహచరుని 'ఎన్‌కౌంటర్' ఎంత అశనిపాతమో. మళ్ళీ తల్లి దగ్గర చేరింది. బతకాలి. తాను బతుకుతూ తల్లిని, బిడ్డను,తమ్ముణ్ణి నిలబెట్టాలి. చెరబండరాజుకున్న మొండిధైర్యమే తనకున్నది. మళ్ళీ ఉద్యోగం.

కాని, 2005లో ఉదయినికి కూడా బ్రెస్ట్‌క్యాన్సర్ అని బయటపడింది. కెమోతెరపీతో నయమయిందనే అనిపించింది. కాని ఊపిరితిత్తులకు వ్యాపించింది. అప్పటికే చెరబండరాజు సేవలో, కష్టాల్లో, సమస్యల్లో శ్యామల శారీరకంగా శిథిలం కావడం ప్రారంభమైంది. కిడ్నీ సంబంధమైన దీర్ఘవ్యాధి. చెరబండరాజు మాటల్లోనే చెప్పాలంటే ఆ ఇంట్లో అందరి అశాంతులకు మందు అయి తిరుగుతున్న పాప సింధూర మాత్రం ఉన్నది. ఒక సంవత్సరంపైగా నిష్కృతిలేని వ్యాధితో క్షోభననుభవించి ఉదయిని 2007 మార్చి 13వతేదీ వేకువన కన్నుమూసింది. 'నాకు బతకాలని ఉంది. మా పాపకోసం బతకాలని ఉంది. కాని ఈ బాధ భరించలేకపోతున్నాను' అనేది తాను.

ఇది నాకు తెలిసిన ఒక ఉదయిని, ఒక చెరబండరాజు కుటుంబం చరిత్రకనుక చెప్పాను గానీ, ఇది మూడున్నర దశాబ్దాల తెలుగునేల చరిత్రకు భిన్నమైంది కాదు. తెలంగాణలో ప్రతి ఇంటికీ ఇటువంటి మంటెపొయ్యి ఉంటుంది. ఇప్పుడు తెలంగాణలోనే కాదు, పలనాడు, రాయలసీమల్లో కూడా ఇటువంటి కుటుంబాలు ఎన్నో ఉంటాయి. ఇటువంటి వందలాది, వేలాది కుటుంబాలకోసం ఏం చేయగలం. సుందరయ్యగారు తెలంగాణ సాయుధపోరాట కాలంలో అమరులైన నాలుగువేలమంది ఇళ్ళకు ప్రతి ఇంటికీ వెళ్ళి పలుకరించాడని చెప్తారు. 'మిస్సింగు' కేసులవిచారణ సందర్భంగా 1989-90లలో బాలగోపాల్‌తోపాటు కొందరు ఇటువంటి ప్రయత్నం చేశారు. 90మేలో రైతుకూలీ సంఘం సభల సందర్భంగా వరంగల్‌లో అటువంటి ఒక అమరుల బంధుమిత్రుల పరస్పర పలుకరింపు సందర్భం కల్పించారు. 2004 నుంచి అమరుల బంధుమిత్రుల సంఘం కూడా పనిచేస్తున్నది. వీరిలో ఆర్థికసహాయం అవసరమైనవారు చాలా ఎక్కువ సంఖ్యలోనే ఉంటారు. దాదాపుగా అన్నీ ఇటువంటి కుటుంబాలు- ఛిద్రమైనవో, శిథిలమైనవో. అయితే, అంతకన్నా ప్రతి ఒక్క రూ ఆశిస్తున్నది మాత్రం ఒక మాటసాయం. ఒక మనిషి సాయం. సమాజం కోసం ప్రాణాలిచ్చిన వాళ్ళ కుటుంబాలకోసం మానవసమాజం ఆమాత్రం చేయలేదా?

## కవిత్వం కళలు, ఉత్పత్తి సంబంధాలనుంచి వచ్చే మానవసారం: కవితా వార్షిక రిపోర్టు - జాన్ హైడ్ కనుమూరి



సృజనలోకం, వరంగల్ ప్రచురించిన "కవితా వార్షిక - 2006" ను 18 మార్చి 2007 తేదిన, వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్, హనుమకొండ లో ఆవిష్కారించారు.

అధ్యక్షులు: డాక్టర్ అంపశయ్య నవీన్
ముఖ్య అతిథి, ఆవిష్కర్త: డాక్టర్ పి. వరవరరావు
ప్రధాన సంపాదకుడు: రామా చంద్రమౌళి

kavithavarshika_1.jpg

అంపశయ్య నవీన్:
తెలుగులో విరివిగావస్తున్నది కవిత్వం. కవిత్వానికుండే విస్తృతి కవిత్వానికుంది. 80 కవితలు ఎన్నికచేసి 2004లోను నాందీ ప్రస్తావన చేసాం. 99 కవితలతో 2005, ఇప్పుడు 92 కవితలతో 2006 వచ్చాయి. కవితలు ఎంపికలో ఏ కొలబద్ద చూసారు అనే ప్రశ్న వస్తుంది. కవిత్వాని అంచనావేయటం చాలా కష్టం. అంచనా వేయడం హైలీ సబ్జెక్టివ్ ( highly subjective). ఎవరి దృష్టికోణాన్నిబట్టి, లిటరరీ బాగ్ గ్రౌండును బట్టి బేరీజువేయడం జరుగుతుంది.
గీతాంజలి తాగి బతికాననంటాడు చలం. డిటెక్టివ్ నవలకంటే చెత్తవుందంటాడు శ్రీశ్రీ. ఎవరి దృష్టికోణంవారిది. ఇవే కచ్చితంగా మంచి కవితలు అనటంలేదు. ఈ సంవత్సరపు కవిత్వంలో సమకాలీన సమస్యలపట్ల కవులు స్పందించారు. స్త్రీవాదం, తెలంగాణా అస్తిత్వం, గ్లోబలైజేషన్ , ముస్లింవాదం, వ్యవసాయరంగం, వలసపోతున్న అంశాలు ఇంత వైవిధ్యం వుంది వస్తుపరంగా, నిజంగా యేది కవిత్వం అనే సమస్యవస్తుంది.

రామా చంద్రమౌళి:

హైస్కూలు జీవితంనుంచి కవిత్వాన్ని సేకరించి పెట్టుకోవడం స్ఫూర్తితో గుచ్చగా అందించాలని ఆలోచన. మొట్టమొదట కవిత్వాన్ని ధారగా అందించాలని ప్రారంభించాం. కవిత్వంతోపాటు, అకడమిక్ అంశాలు, కవితాగోష్టి – అనుబంధం, కవితానేపథ్యం ప్రస్తావించాం. గత సంవత్సరం యూనివర్సిటీలనుండి మంచి స్పందన వచ్చింది. కొన్ని పరిమితులవల్ల చేర్చలేనివివాటిని ఆపి, తిరిగి వెనక్కు చూసుకొని ... అందించాం. భారతీయ భాషలతో బేరీజువేసుకొనే క్రమంలో ఇతర భాషలనుండి తెలుగులోకి, తెలుగునుండి ఇతరభాషలలోకి అనువదిస్తూవున్న వారితో గోష్టి చేర్చడం జరిగింది. అనువాద రంగంలో ఆరుగుర్ని ఎన్నుకుని వినిమయం ఎలా జరుగుతుందనే గోష్టి ఏర్పాటు చేసాం. మొత్తం 2116 కవితలు సేకరించి వాటిలో మొదట వడపోతగా 923 ఎన్నిక చేసాము. చివరగా వాటిలో 92 కవితల్ని ఎన్నిక చేయడం జరిగింది. ఇది సంపూర్ణమూ కాదు, సమగ్రమూ కాదు మా దృష్టి అందినంతమేరకు, అభిరుచిమేరకు అందిస్తున్నాము.
సాహితీ మిత్రులు విజయవాడనుండి కూడా వచ్చారు. వాత్సల్యంతో, ప్రేమతో మా ఆహ్వానాన్ని మన్నించి ఆవిష్కరణలు వచ్చినవారందరికీ సృజనాలోకం పక్షాన ధన్యవాదాలు.



విప్లవకవి వరవరరావు:
కవిత వార్షిక పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ఆర్ట్స్ కాలేజీలో మేం చదువుకున్న క్లాసురూము ప్రక్కనే నిర్మాణమైన హాలులో మాట్లాడటం ఉద్విగ్నంగా వుందని, ఇక్కడే రాసిన 'సోషలిస్టు చంద్రుడు' జ్ఞాపకం చేసుకున్నారు.
పుస్తకానికి చుట్టిన బట్టవిప్పుతున్నప్పుడు ఎర్రని వెల్ వెట్ బట్ట మృదువుగా తగులుతుంటే 'ఎర్రశాలువా కప్పుకుని రివాల్వర్ వచ్చిందన్న' శ్రీశ్రీ కవిత గుర్తొచ్చిందన్నారు. ఎర్రశాలువా కప్పుకున్న ఈ కవితావార్షిక ప్రజలచేతుల్లో రివాల్వర్ అయితే బాగుంటుంది. అది నా ఆశ.

కవిత్వాన్ని గురించి చెబుతూ జార్జి థాంసన్ కవిత్వం మానవసారమంటాడు. కవిత్వంలో చెప్పినదంతా శీర్షికకూడా చెప్పాలి. ఎప్పుడు మానవసారం అవసరమౌతుంది?

జ్ఞానం, కళ ఆదిమ సమాజంయొక్క అవసరం. అహార అన్వేషణలో తెలుసుకుంటున్న నేపథ్యం అవసరం. ఆహార అన్వేషణ క్రమంలోనే వేటాడే దశలో కళలొచ్చాయని అంటారు. ఆహార అన్వేషణలో ఉత్పత్తిలో పాల్గొనటంలో సాహిత్యం పుడ్తుంది. కవిత్వం కళలు, ఉత్పత్తి సంబందాలనుంచి వచ్చే మానవసారం.

రామాయణంలోని వాల్మీకిలో న్యాయమైన కోపంవుండటం, స్త్రీకి ఆశ్రయమివ్వడం ఎక్కడో మానవసారం కన్పిస్తుంది. వరంగల్లుకు చెందిన వాడు పాలకుర్తి సోమనాధుడు. ఆయనలాంటివాడు దేశంలోనే పుట్టలేదు. అయిలమ్మ పాటలు మధ్యకాలంలో ప్రత్యమ్నాయ సంస్కృతిని సృషింపబడింది. కాళోజి వారసత్వం కల్గిన వరంగల్లునుంచి ఈ సంకలనం రావటం అభినందనీయం అన్నారు.

మూడు సూచనలు:

1) కవితాసంకలనంలో క్రోనలాజికల్ కు పాటించవలసింది వరుస తేదీలే. అక్షరక్రమంకాదు
2) ఆరుగురు సంపాదకులు వున్నారు పని పంచుకుని వస్తున్న సాహిత్య పత్రికల్ని చూడవలసిన అవసరమున్నది.
3) తీసుకోలేని కవితల లైన్లువేస్తున్నప్పడు అనుమతితోనే వేస్తే బాగుంటుంది. సూచనలతో ముగిస్తున్నాను.

కొండేపూడి నిర్మల:

'మనిషి వస్తువుకింద పడి చచ్చాడు' ఓ కవి అన్నవాక్యాలను గుర్తుచేస్తూ వస్తువుకున్న ప్రాముఖ్యత సంకలనం ద్వారా యువతరానికి చేరుతుందాయని ప్రశ్నించారు? యువతకోసం చేతులు కాల్చుకోవల్సివుంటుందని చమత్కరించారు. ప్రపంచీకరణమీద ఎలా దాడి చెయ్యాలి అనేది, వక్తీకరణశక్తి మీద ఆధారపడివుంటుంది. నిజమైన కవిత్వానికి, కవికి వేదికలు తక్కువయ్యాయని చెబుతూ 'చివరి చిరునామా' తో ముగించారు.

జూలూరి గౌరీశంకర్

వరంగల్ లాంటి చైతన్యనగరంనుంచి ఏకైక కవితాసంకలనం తెస్తున్నందుకు అభినందించారు. 'అన్నివాదాల, అన్ని ప్రాంతాల కవుల సంకలనం వేస్తున్నప్పడు వచ్చే ఫలితమేమిటి? అనే ప్రశ్న లేవనెత్తారు. ఎంపికకోసం పరిశీలించిన వారి పేర్లు పట్టికగా యిస్తే రికార్డు అవుతుంది, లేకపోతే మళ్ళీ యే జాషువా మిగిలిపోతున్నాడో! తెలంగాణాలో ప్రత్యేకంగా కవితాసంకలనం ఎందుకు తేకూడదు? అని సూచనలు చేసారు.
రాజ్యంతో పోరాడేవాడే కవి, కలబడేవాడు కవి, అలాంటివారిని యువకుల్లోకి తీసుకురాలేక పోవడం మనందరి వైఫల్యం. ఉద్యమంగా చేసేవైపు అడుగులు వేయాలి.

''జొన్నకంకుల కవిత్వం, తల్లిపాల కవిత్వం, యుగస్పృహ తెలంగాణా కవిత్వం'' అని ముగించారు.
మొదటి సెషన్ పూర్తి అయ్యింది. భోజనానంతరం:

వి.ఆర్ . విద్యార్థి అధ్యక్షతన నెల్లుట్ల రమాదేవి నిర్వహణలో కవితోత్సవం జరిగింది. 41 మంది తమ కవితల్ని వినిపించారు. ఇందులో యల్ .ఆర్ . స్వామి, వరవరరావు, కొండేపూడి నిర్మల, బన్న అయిలయ్య, శైలజామిత్ర, పెరుడు రామకృష్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్ , అన్వర్, పల్లం మాధవీలత, అపరాజిత, పై.శ్రీరాములు, రామతీర్థ , జగధాత్రి, జాన్ హైడ్ కనుమూరి, వఝల శివకుమార్ , నెల్లుట్ల రమాదేవీ …… కవితా పఠనం చేసినవారిలో వున్నారు.

లంకా శివరామప్రసాద్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## కవితా వార్షిక ప్రధాన సంపాదకుడు రామా చంద్రమౌళితో ముఖాముఖి

కవితా వార్షిక- 2006 ఆవిష్కరణ సందర్భంగా ప్రధాన సంపాదకుడు రామా చంద్రమౌళితో ముఖాముఖి

'సృజనలోకం వరంగల్' ప్రచురణగా అంతర్జాతీయ ప్రమాణాలతో గత మూడు సంవత్సరాల నుండి వెలువడుతూ తెలుగు వచన కవితను ప్రపంచవ్యాప్తం చేస్తున్న నేపథ్యంలో, కవితా వార్షిక- 2006ను ప్రముఖ విప్లవకవి డాక్టర్ పెండ్యాల వరవరరావు 18 మార్చి 2007, ఆదివారం ఉదయం పదకొండు గంటలకు వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆవిష్కరించారు.

కవితాభిమానులు ఉద్విగ్నంగా ఎదురుచూస్తున్న ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 'కవితా వార్షిక' ప్రధాన సంపాదకులు రామా చంద్రమౌళితో ఈ ఇంటర్వ్యూను ప్రచురిస్తున్నాం.



* అకవితా వార్షిక కోసం కవితలను ఎంపిక చేస్తున్నప్పుడు ప్రధానంగా మీ సంపాదకవర్గం ఏ అంశాలను పరిగణనలోకి తీసుకుంటోంది?

ఆ నిర్దేశిత సంవత్సరాకాలంలో వివిధ మాధ్యమాల ద్వారా వెలువడ్డ తెలుగు వచన కవితలను సాధ్యమైనజంత విస్తృతంగా సేకరించి మౌలికంగా కవితాత్మక వ్యక్తీకరణలో వినూత్న వస్తువును ఆలంబనగా చేసుకుని హృదయాన్ని స్పర్శించగలిగే మననశీలమైన కవితలను నిజాయితీగా ఎంపిక చేస్తున్నాం. కవి పేరును అసలు చూడకుండా ఆ కవితలో ప్రదర్శితమౌతున్న వైవిధ్యాన్నీ, కొంగ్రొత్త అభివ్యక్తిని గుర్తించి పాఠకులకు అందించే ప్రయత్నం చేస్తున్నాం. ఈ క్రమంలో ఎందరో ప్రతిభాశీలురైన అంతగా పేరు లేని కవులు కూడా కేవలం వాళ్ళ ప్రత్యేకత వల్ల వెలుగులోకి వస్తున్నారు.

* ఏ లక్ష్యంతోనైతే మీరు కవితా వార్షికలను నిరంతరాయంగా వెలువరించాలని సంకల్పించి నిబద్ధతతో వెలువరిస్తున్నారో... మీ ఆ లక్ష్యం నెరవేరినట్టుగా భావిస్తున్నారా?

మేము మొదటే చెప్పినట్టు 'కవితా వార్షిక'ను వెలువరించడంలో ప్రధానంగా రెండు లక్ష్యాలున్నాయి. ఒకటి- ఒక సంవత్సరకాలంలో వెలువడ్డ ఉత్తమ తెలుగు వచన కవితను ఒక గుచ్ఛంగా, ధారగా కవిత్వాభిమానులకు

అందించి మన ఉనికిని మనం శాస్త్రీయంగా దర్శించి అంచనా వేసుకోవడం. మన నడకను మనం సమీక్షించుకుని అధ్యయనం చేయడం. రెండవది- ఇతర భారతీయ భాషలలోగాని, ప్రపంచ భాషలలోగాని సమకాలీనంగా వెలువడుతున్న వచన కవిత స్థాయితో ఈ తెలుగు కవితా వస్తువును పోల్చి మనను మనం బేరీజు వేసుకోవడం, భవిష్యత్తులో మరింత ఉన్నతమైన కవితను వెలురించడానికి ఈ వర్తమాన స్థితిని వికాస దశలో ఇంకా ఉన్మీలింపజేయడం. ఈ దృష్టితో మేము పూర్తిగా మా లక్ష్యాలను చేరుకుంటూనే ఉన్నాం.

* కవిత్వాభిమానులు, కవులు మీ ఈ ప్రయత్నాన్ని ఎలా స్వీకరిస్తున్నారు?

'కవితా వార్షిక' క్రమం తప్పకుండా ఒక పరంపరగా వెలువడుతున్న ఈ సందర్భంలో మన పొరుగు రాష్ట్ర పాఠకులైన తమిళ, కన్నడ, మలయాళ కవిత్వాభిమానుల ప్రతిస్పందనలను ప్రత్యేకంగా నేను రికార్డు చేశాను. ప్రతి ఒక్కరూ ఈ ప్రచురణను ఒక అతి ప్రయోజనకరమైన ప్రయత్నంగా ప్రస్తావించి అభినందించారు. ఆయా రాష్ట్రాల్లో ఈ రకంగా ఒక వార్షికగా కవితా సంపుటాలను వెలువరిస్తున్నట్టుగా ఎవరూ చెప్పలేదు. కాగా, 'తెలుగు కవిత్వా'నికి సంబంధించి ప్రతి సంచికలోనూ మేము ప్రచురిస్తున్న 'కవితా గోష్ఠి' ఒక పరిపుష్టమైన విద్యావిషయక (అకడమిక్) విలువలను కలిగి ఉన్న సమాచారంగా, పరిశోధనా స్థాయిగల సాహిత్య అంశాల సమాహారంగా విజ్ఞులు ప్రస్తుతించారు. 'కవితా నేపథ్యం' శీర్షిక క్రింద మా సహ సంపాదకులు డా|| లంకా శివరామప్రసాద్ రాస్తున్న వినూత్న ప్రస్తావనలు కూడా అనేకమంది కవితా ప్రియుల ప్రశంసలను పొందాయి. ఇక కవుల ప్రతిస్పందనలూ ఉన్నతంగానే ఉన్నాయి. అయితే 'కవితా వార్షిక'లో స్థానం పొందలేకపోతున్న కొందరు కొద్దిగా నిరుత్సాహ పడడం మా దృష్టికి వస్తోంది. కాని కొన్ని ప్రమాణాలతో రాజీపడకపోవడం మా నిబద్ధతలో ఒక ప్రధానాంశం కావడం వల్ల మేము కవులందర్నీ తృప్తిపరచలేం.

* తెలుగు వచన కవితను అంతర్జాతీయ కవిత్వాభిమానులకు అందించాలనే ప్రయత్నంలో అప్పట్లో 'మో' దిస్ టెన్స్ టైమ్ సంపుటిని వెలువరించారు కదా. తర్వాత అటువంటి ప్రయత్నాలు జరగలేదు. 'కవితా వార్షిక'ల ద్వారా ఉత్తమ తెలుగు వచన కవిత్వాన్ని ఒకచోట ప్రోది పరుస్తున్న మీకు దీన్ని అంతర్జాతీయం చేసే ఆలోచన ఏదైనా ఉందా?

మనం ఉత్తమమైనదని భావించిన మన తెలుగు వచన కవిత యొక్క మూల సౌందర్యం, జీవ పరిమళం ఏమాత్రం ధ్వంసం కాకుండా అతి పదిలంగా ఇంగ్లీష్ భాషలోకి అనువాదం చేయగల ఒక 'అనువాదకుల బృందాన్ని' మేము ప్రస్తుతం కూర్చుకొంటున్నాం. ఒక మూడు లేక నాలుగేళ్ళ కాలాన్ని 'పరిగణన'గా చేసుకొని తెలుగుభాషలోని ప్రాతినిధ్య వచన కవితను ఇంగ్లీష్ భాషలో వరుసగా వెలువరించాలనీ, అంతర్జాతీయ పాఠకులకు తెలుగు కవిత పసిడి వెలుగులను పరిచయం చేయాలనీ ఉంది. ఈ సంకల్పం మున్ముందు కార్యరూపం దాల్చి సాకారమౌతుంది.

* తెలుగు వచన కవులు కవితా వస్తువును ఎంచుకొనే క్రమంలో సామాజిక ప్రయోజనాన్ని కూడా దృష్టిలో పెట్టుకొనే సృజన చేస్తున్నారా?

మిగతా భారతీయ భాషల్లో వెలువడుతున్న కవిత్వంతో పోల్చి చూసినపుడు అనుభూతివాద, మార్మికవాద, నైరూప్య కవిత్వ ధోరణులు మన తెలుగు వచన కవిత్వంలో తక్కువగానే కనిపిస్తాయి. స్పష్టత, సామాజిక రుగ్మతల పట్ల స్పందన, మానవతా విలువలు ధ్వంసమౌతున్నప్పుడు ఆవేశంతో కూడిన ధర్మాగ్రహం- ఇవే మన కవితల్లో ప్రతిఫలించేవి.

## వాలంటీర్ కరస్పాండెంట్ లకు ప్రజాకళ ఆహ్వానం:

ప్రజాకళ సాహిత్య పత్రికను విస్తరించే క్రమంలో భాగంగా పల్లెలు, పట్టణాలు, జిల్లాలు, నగరాలు విశ్వవిద్యాలయాల వారిగా వాలంటీర్ కరస్పాండెంట్ లు, సాహిత్య వాలంటీరులను ఆహ్వానిస్తున్నాం.

- కవిత్వం, కథ, వచనాల స్వేచ్ఛానుసరణ, అనువాదం చేయటం
- సాహిత్య సభలకు హాజరై రిపోర్టులు, సాహిత్యకారుల ప్రసంగాలు రాయటం, ఆడియో రికార్డు చేయటం

- పుస్తక సమీక్షలు, నిర్మాణాత్మక విశ్లేషణలు చేయటం
- కవిత్వం, వచనం పైన సాహిత్య పరిశోధన, విమర్శ రాయటం
- సాహిత్యవికాసానికి సాహిత్య పాఠశాలలు, కథా వర్క్- షాప్ నిర్వహించటం
- సాహిత్యపుస్తకాల లైబ్రరీ సేవలు, పుస్తకాలను అందించటం
- యూనికోడ్ గౌతమీ లో రెండు,మూడు పేజీలు టైపుచేయటం
- ఎడిటింగ్, ప్రూఫ్ రీడింగ్ చేయటం
- వర్డ్ ప్రెస్సు ( wordpress), వెబ్ సాంకేతిక సేవలు అందించటం
- పత్రికను నడపటానికి అవసరమైన వనరులను అందించటం

ఈమేల్ ఐ.డి:

editor@Prajakala.org
Prajakala@gmail.com

## 'నాకు నచ్చిన కథ', 'నాకు నచ్చిన కవిత' - కొత్త శీర్షికలు

సాహిత్య అధ్యయనంలో భాగంగా ప్రజాకళ కొన్ని కొత్త శీర్షికలను మొదలుపెడుతుంది.

* మీకు నచ్చిన కథ కానీ, మిమ్మల్ని కదిలించిన కవిత కానీ అధ్యయనం చేసి, దానిపైన ఒక నిర్మాణాత్మక విశ్లేషణ రాయవలసినదిగా పాఠకులనూ, రచయితలనూ ఆహ్వానిస్తున్నాం.

* ముఖ్యంగా ఆ రచనలో వస్తువు, శిల్పం, శైలి, భావం, లోపాలు, సామాజిక - రాజకీయ నేపధ్యాలనూ నిర్మాణాత్మక విశ్లేషణ, విమర్శ చేయాలి.

* పొగడ్తలు, ప్రశంశలు పక్కనపెట్టి, రచనలో పాత్రలు, సన్నివేశాలు, భావవ్యక్తీకరణ, వాస్తవికత, సాహిత్య విశ్లేషణ వుండాలి.

* గౌతమీ తెలుగు యూనికోడ్ లో టైపు చేసి పంపించండి

*ఈ శీర్షికలో వచ్చే వ్యాసాలలో కొన్నింటిపైన అనుభవంగల రచయితలు, కవులు సలహాలు ఇస్తారు

ఈమేల్ :

editor@Prajakala.org
Prajakala@gmail.com

## స్వాతంత్ర్య పోరాటం: ఉల్లేఖనాలు

“ఒక మానవుని మరో మానవుడు దోచుకోవడానికి వీలులేని న్యాయ సమ్మతమైన ఆర్థిక వ్యవస్థను స్థాపించడంకోసం మేం క్రాంతిని ఆహ్వానిస్తున్నాం.

- భగత్ సింగ్

……………………………………………………………………………………………

“గాంధీజీ ఉద్దేశం ఏమిటో నాకు అర్థం కాలేదు. రహస్యం ముందు ప్రకటించటం వారికి ఇష్టం లేదో, లేకపోతే ఆంగ్ల ప్రభుత్వాన్ని ఎలా ఓడించాలో వారికీ తెలియదేమో”

- నేతాజీ సుభాశ్చంద్రబోస్

……………………………………………………………………………………………

“మానవుల్లో భయమూ ఆత్మరక్షణకు ప్రయత్నించడమూ సహజ ప్రవృత్తులు. ఈ సహజ ప్రవృత్తులకు వ్యతిరేకమైంది ఆత్మహత్య. విప్లవాన్ని ఆత్మరక్షణతో పోల్చుకుంటే, సత్యాగ్రాహాన్ని అత్మహత్యకు పోల్చవచ్చును. ఆత్మహత్యా సదృశమైన అసహజమార్గంలో నడవగలవారు ఒకరో ఇద్దరో ఉండవచ్చును. వాళ్ళయినా వెనుకనుండి ప్రజల సానుభూతి తమకు అండగా వుందన్న వున్నప్పుడే ఆ మార్గాన నడువగలరు”

- యశపాల్

……………………………………………………………………………………………

“విప్లవకారులమైన మేము విప్లవం ద్వారానే ఈ దేశ ప్రజలకు దాస్య విముక్తి కలుగుతుందని అనుకుంటున్నాము. విప్లవం అంటే మా ఉద్దేశ్యంలో పర ప్రభుత్వంతో పోరాడటం మాత్రమేకాదు. మా విప్లవానికి ఆదర్శం న్యాయ సమ్మతమైన ఒక క్రొత్త సమాజాన్ని స్థాపించడం. పెట్టుబడిదారీ విధానాన్ని నాశనంచేసి, వర్గ రహితమైన సమాజ వికాసానికి దోహదం చేయడం. విదేశీయుల దోపిడి నుండి, దేశీయుల దోపిడి నుండి ప్రజలను కాపాడి, వారికి స్వయం నిర్ణయాధికారాన్ని ఇవ్వడం మా విప్లవానికి ఆదర్శం –“

- చంద్రశేఖర్ ఆజాద్

……………………………………………………………………………………………

“స్వాతంత్ర్యం దానం మాదిరి ఒకరి నుండి స్వీకరింపబడదు. అలా స్వీకరించినా అది నిలవదు. స్వాతంత్ర్యం కోసం మన హృదయ రక్తంమర్పించి దానిని పొందాలి”

- గాంధీ

……………………………………………………………………………………………

దేశాభిమానం నాకు కద్దని వొట్టి గొప్పలు చెప్పకోకోయ్
పూని యేదైననూ ఒక మేల్ చేసి జనులకు చూపవోయ్

- గురజాడ అప్పారావు

……………………………………………………………………………………………

“విప్లవాన్ని వ్యతిరేకించేవారు కేవలం పిస్తోళ్ళు, బాంబులు, కత్తులు, రక్తపాతమే విప్లవం అనుకుంటున్నారు. ఇవి విప్లవానికి సహకరించేవి మాత్రమే. కేవలం ఆయుధాలే విప్లవం కాదు. వీటివెనుక సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను పూర్తిగా మార్చుకోవాలన్న బలమైన కోర్కె ఉంటుంది. అదే నిజమైన విప్లవశక్తి” అదీ విప్లవ నిర్వచనం.

- భగత్ సింగ్

……………………………………………………………………………………………

“ నా జీవితంలో దేవుడిని ఎన్నడూ తలచుకోలేదు. దేవుడనేవాడుంటే. నాదేశస్తులు అనుభవిస్తున్న కష్టనష్టాలను చూస్తూ వూరుకుంటున్నందుకు కొన్నిసార్లు ఆ దేవుణ్ని నిందించానుకూడా. ఈ చివరిక్షణంలో మృత్యువుకు యెదుట నిలచి దైవాన్ని ప్రార్థిస్తే అతడు నన్ను పిరికిపంద ఆత్మవంచకుడు అనుకుంటాడు. నన్ను ఇప్పుడున్న విధంగానే ఈ లోకంనుంచి వెళ్ళనివ్వండి. ఏ ఒక్కరుకూడా భగత్ సింగ్ చావునుచూసి భయపడిన పిరికిపంద అని నిందించకూడదు.”

- భగత్ సింగ్

……………………………………………………………………………………………

అవినీతి బంధుప్రీతి చీకటి బజారు అలుముకున్న ఈ దేశం ఎటు దిగజారు? కాంచవోయి ఈ దుస్థితి – ఎదిరించవోయి ఈ పరిస్థితి !
- శ్రీ శ్రీ

మలయశ్రీ రాసిన ''బొమ్మల భగత్ సింగ్'' పుస్తకం నుండి

------ ------ ముగింపు -----------------